ప్రజాశక్తి

శుక్రవారం 24 మే 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు





అరెస్టులు - బైండోవర్లు



ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి లొంగిపోతారనే సమాచారంతో నరసరావుపేట కోర్టు ప్రాంగణంలో పోలీసుల బందోబస్తు

- పల్నాడులో కొనసాగుతున్న పోలీసుల అన్వేషణ
- ఈవీఎం ధ్వంసం కేసులో పోలింగ్ అధికారుల సస్పెన్షన్
- హైకోర్టులో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ఊరట
- మధ్యంతర బెయిల్ మంజూరు
- రాంబాబు రీపోలింగ్ పిటీషన్ తిరస్కరణ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున, అనంతరం కొనసాగిన అల్లర్లపై నిందితులుగా ఉన్న వారిని పోలీసులు క్రమంగా అరెస్టు చేస్తున్నారు. పలువురిని బైండోవర్ చేస్తున్నారు. నిందితుల గుర్తింపునకు విస్తృతంగా అన్వేషణ కొనసాగిస్తున్నారు. కేసుల తీవ్రతను బట్టి 41ఎ నోటీసులిచ్చి లిఖితపూర్వకంగా సమాధానం తీసుకుంటున్నారు. మొత్తంగా పల్నాడు ప్రాంతంలోని మాచర్ల, వినుకొండ, గురజాల, సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో జరిగిన అల్లర్లు పోలీసు శాఖకు శిరోభారంగా మారాయి. కొత్త ఎస్‌పి మల్లికా గర్గ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

నరసరావుపేట, మాచర్ల, గురజాల, పెదకూరపాడు, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో మొత్తం జిల్లాలో 22 కేసులు నమోదయ్యాయి. 581 మందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. గుర్తించిన నిందితుల్లో అరెస్టుల పరంపర కొనసాగుతోంది. 274 మందిని ఇప్పటి వరకు గుర్తించగా గురువారం మొత్తం 54 మందిని అరెస్టు చేసినట్టు ఎస్‌పి మలికా గర్గ్ తెలిపారు. దాచేపల్లి మండలం తంగెడలో జరిగిన ఘర్షణల కేసుల్లో వైసిపికి చెందిన 22 మందిని, టిడిపికి చెందిన 11 మందిని అరెస్టు చేశారు. నరసరావుపేట, గురజాల, సత్తెనపల్లి సబ్ డివిజన్ల పరిధిలో 9 మందికి 41ఎ నోటీసులిచ్చినట్లు పల్నాడు ఎస్పీ తెలిపారు. మొత్తం 74 మందిని బైండోవర్ చేశామని, వీరిలో నరసరావుపేట సబ్ డివిజన్లో ఒకరు, సత్తెనపల్లి సబ్ డివిజన్లో 46 మంది, గురజాల సబ్ డివిజన్లో 27 మంది ఉన్నారని, నరసరావుపేట సబ్ డివిజన్‌లో మరో ఐదుగురిపై రౌడీషీట్లు

▶ 2లో



లెక్కింపు కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లపై మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

లెక్కింపులో అలసత్వం వద్దు

- కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన పల్నాడు కలెక్టర్, ఎస్పీ
- కాలేజీ ప్రహరీ చుట్టూ 100 మీటర్ల వరకు బారీ కేడింగ్ ఏర్పాటుకు కలెక్టర్ ఆదేశం
- 6వతేదీ వరకూ ర్యాలీలు, ఉరేగింపులు నిషేధమన్న ఎస్పీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రకడ్బందీగా జరిగేలా చర్యలు చేపట్టాలని, ఓట్ల లెక్కింపు ప్రక్రియలో సిబ్బంది ఎవరూ అలసత్వం ప్రదర్శించకూడదని పల్నాడు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికలాధికారి శ్రీకేశ్ లత్కర్ ఆదేశించారు. నరసరావుపేట మండలం కాకాని గ్రామ పరిధిలో గల జెఎన్‌టియు కళాశాలలో ఓట్ల కౌంటింగ్ ఏర్పాట్లను ఆయన ఎస్పీ మలికా గార్గ్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రంలో నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలన్నారు. కౌంటింగ్ రోజు కళాశాల ప్రహరీ చుట్టూ 100 మీటర్లు వరకు బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, 100 మీటర్ల లోపలికి ఏ వాహనాన్ని అనుమతించకూడదని చెప్పారు. ప్రధాన ద్వారం వద్ద పోలింగ్ ఏజెంట్లను అభ్యర్థులను కౌంటింగ్ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపల పంపించాలన్నారు. సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు ముందుగానే కౌంటింగ్ ఏజెంట్లకు, అభ్యర్థులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కౌంటింగ్ రోజున నిర్వహించవలసిన విధివిధానాల గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలోనే స్ట్రాంగ్ రూములను తెరవాలన్నారు. ప్రతి నియోజకవర్గ కౌంటింగ్‌లో సంబంధిత రిటర్నింగ్ అధికారి ఇన్‌ఛార్జి వ్యవహరిస్తారన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల అనంతరం జరుగుతున్న పరిణామాల మీద ప్రత్యేక నిఘా ఉంచామని, జిల్లాలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అనుమానితులను బైండోవర్ చేస్తున్నామని తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు ర్యాలీలు, ఊరేగింపులు, బాణాసంచాలు కాల్చడం పూర్తిగా నిషేధమన్నారు. పరిశీలనలో మాచర్ల నియోజకవర్గ ఆర్ఎ, జిల్లా జెసి ఎ.శ్యాం ప్రసాద్,

▶ 2లో

డబ్బు కోసం తల్లిపై గొడ్డలితో దాడి

ప్రజాశక్తి - మాచర్ల



డబ్బు కోసం తల్లిపైనే కుమారుడు గొడ్డలితో దాడికి పాల్పడిన ఘటన వెల్దుర్తి మండలం గంగలకుంటలో గురువారం జరిగింది. గాయాల పాలైన శివమ్మను 108 ద్వారా మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దీనిపై శివమ్మ మాట్లాడుతూ తన భర్త చనిపోయి రెండు నెలలు కూడా కావడం లేదని, డబ్బులు ఇవ్వాలంటూ కొడుకులు గొడవ చేస్తున్నారని తెలిపారు. ఆ డబ్బు కోసమే గొడ్డలితో దాడి చేశారన్నారు. తమకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారని, తమకున్న పొలాన్ని తన భర్త బతికుండగానే తమ కుమార్తెపిల్లలందరికీ పంచారని, తమకోసం కొంత మాత్రం తమ వద్ద పెట్టుకున్నాని చెప్పారు. అనారోగ్యానికి గురైన తన భర్త వైద్యం కోసం, రోజువారీ ఖర్చులకు తమ వద్ద ఉన్న డబ్బులు ఖర్చయ్యాయని, అయినా ఉన్నాయనే అనుమానంతో కుమారులు గొడవ చేస్తున్నారని అన్నారు. గ్రామంలోనే తానుంటే చంపుతారని, అందుకే ఆస్పత్రి నుండి వెళ్లాక ఏక్కడైనా తలదాచుకుంటానని చెప్పారు. తమ కుమార్తెను కళ్లకుంటలో ఇచ్చి పెళ్లి చేశామని, ఆమె దగ్గరకు వెళ్తామంటే ఆమె కూడా బెదిరిస్తున్నారని శివమ్మ వాపోయారు. దాడి ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రెంటచింతలలో డయేరియా

ప్రజాశక్తి - రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో డయేరియా ప్రబలింది. వాంతులు, విరోచనాలతో పలువురు ఆస్పత్రి పాలయ్యారు. కొంతమంది స్థానికంగా చికిత్స చేయించుకున్నా పరిస్థితి మెరుగవకపోవడంతో నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే ముగ్గురు డయేరియా బారిన పడినట్లు తెలుస్తోంది. ఆ ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పారిశుధ్య చర్యలు చేపట్టారు. తీవ్రమైన ఎండలు, బోరు నీరు తాగడం వల్ల ఈ పరిస్థితి వచ్చి ఉండొచ్చని వైద్యులు భావిస్తున్నారు.

పనుల లేమి.. పగలకు బలిమి..!

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

- రాజకీయ ఘర్షణల్లో పావులుగా సామాన్యులు
- వ్యవసాయం లేక, ఉపాధి హామీ పనుల దక్కక ఆర్థిక ఇబ్బందులు
- అప్పులిచ్చి, చేరదీసి, ఎగదోస్తున్న రాజకీయ అవకాశవాదులు

దెబ్బతిన్న వ్యవసాయం, తగ్గిన కూలి పనులు వెరసి కుటుంబ పోషణను భారంగా చేసింది. ఇల్లు గడవాలంటే ఎవరో ఒకర్ని ఆశ్రయించక తప్పని పరిస్థితుల్లో పేదలు అనివార్యంగా రాజకీయ పావులై నాయకుల కింద ఘర్షణ కూలీలయ్యారు. వ్యవసాయ పనుల్లేక, ఉపాధి హామీ పనులూ దక్కక నిట్టూరుస్తున్న వారిలో నిద్రాణంగా ఉన్న పగలను రేపింది. ఈ పరిస్థితులను ఎన్నికల సంగ్రామం పతాక స్థాయికి చేర్చింది. రాష్ట్రమే విస్తుపోయేలా పల్నాడు జిల్లాలో పోలింగ్ రోజున, అనంతరమూ పల్నాడు జిల్లాలో రెండు ప్రధాన పార్టీలు పరస్పరం ఘర్షణలు పడ్డ విషయం తెలిసిందే. గ్రామీణ ప్రాంతాల్లోనే ఈ ఘర్షణలు అధికంగా ఉండడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఈ గొడవల్లో

▶ 2లో



ఇటీవల మాచవరం మండలం కొత్తగణేసునిపాడులో ఎన్నికల అనంతరం తలెత్తిన వివాదం



నేటి నుండి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో నేటి నుండి పదో తరగతి, ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇటీవల విడుదలైన టెన్త్, ఇంటర్ పరీక్షల ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులతోపాటు, బెటర్‌మెంట్ పరీక్షలు రాసే వారు కూడా ఈ పరీక్షలకు హాజరవుతున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా

▶ 2లో

నేటి నుండి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. పదో తరగతి పరీక్షలకు 6,373 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరి కోసం 27 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. జూన్ 3వ తేదీ వరకూ జరుగుతాయి. ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్ష నిర్వహిస్తారు. ప్రతి పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లను నియమించారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 17,776 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరి కోసం జిల్లా వ్యాప్తంగా 36 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పరీక్ష ఉంటుంది. మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకూ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తారు.

లెక్కింపులో అలసత్వం వద్దు

(మొదటి పేజీ తరువాయి)

రిటర్నింగ్ అధికారి రమణకాంత్‌రెడ్డి, నరసరావుపేట ఆర్డీఓ పి.సరోజిని, ఈవీఎం నోడల్ అధికారి అజయ్ కుమార్ పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రం వద్ద డ్రోన్ల ఎగురవేత నిషేధం

ఓట్ల లెక్కింపు కేంద్రమైన జెఎన్‌టియు కళాశాలలో ప్రాంగణంలో లేదా సమీప గ్రామాల్లో మానవ రహిత డ్రోన్లను ఎగురవేయడం నిషేధమని కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు. నిబంధన అతిక్రమిస్తే చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



శస్త్ర చికిత్సలో నైపుణ్యతపైనే ఫలితాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రోడ్డు ప్రమాదాలు, ఇతర ప్రమాదాలు ఏవైనా శరీరంలో ఎముకలు, కీళ్లు మల్టిపుల్ ఫ్రాక్చర్స్‌కు గురైనప్పుడు ఆ భాగంలో ఎముకలు ,కీళ్లు అనేక ముక్కలు ముక్కలుగా అస్తవ్యస్తమవుతాయని, వాటిని శస్త్ర చికిత్స ద్వారా తిరిగి సాధారణ స్థితికి తీసుకురావడం ఎంతో శ్రమతో నైపుణ్యత తో కూడిన అంశమని ఆస్టర్ రమేష్ హాస్పటల్ కన్సల్టెంట్, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ జి .జగదీష్ అన్నారు. గురువారం స్థానిక ఒక హొటల్లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు శాఖ, ఆస్టల్ రమేష్ హాస్పిటల్స్ సంయుక్తంగా నిర్వహించిన నిరంతర వైద్య విద్యా కార్యక్రమంలో డాక్టర్ జి.జగదీష్ ప్రధాన వక్తగా పాల్గొని ఎముకలు, కీళ్లు సంక్లిష్ట చికిత్స పద్ధతులపై ప్రసంగించారు. కార్యక్రమానికి ఐ.ఎం.ఏ గుంటూరు శాఖ అధ్యక్షులు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు.

పనుల లేమి.. పగలకు బలిమి..!

(మొదటి పేజీ తరువాయి)

పేదలే ప్రధానంగా బలవుతుండగా అందుకు ఆర్థిక అంశాలూ కారణమవుతున్నాయి.

పల్నాడుకు పౌరుషాల గడ్డ అనే పేరున్నా మరోవైపు వెనకబాటూ తనాన్నీ మూటగట్టుకుంది. మౌలిక సదుపాయాలైన విద్య, వైద్యం లాంటివి ఇక్కడివారికి సరిగా అందుబాలులో ఉండవు. దీంతోపాటు ప్రజల ఆర్థిక పరిస్థితీ అంతంతమాత్రమే. ఏ రోజు పనిచేసుకుంటే ఆరోజు పూట గడిచే పరిస్థితుల్లో ఉండే పేదలకు ఉపాధి పనులూ కొరవడ్డాయి. వ్యవసాయమే జీవనాధారంగా బతికే గ్రామాల్లో నీటి కొరత కారణంగా సాగు విస్తీర్ణం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. పిడుగురాళ్ల డివిజన్ పరిధిలోని 5 మండలాల్లో గతేడాది 97 శాతం పొలాలు సాగవ్వగా ఈ ఏడాది 57 శాతం మాత్రమే సాగైంది. దీంతో కూలీలకు పనిదినాలు గణనీయంగా పడిపోయాయి. సాగైన పంటల్లోనూ కూలి పనులు తక్కువగా ఉండే అపరాలు సాగయ్యాయి. సాధారణ వ్యవసాయమైతే ఆరు నెలల వరకూ ఏదో ఒక పని ఉంటుంది. ఇప్పుడు రెండు నెలల పనులే కానాకష్టంగా ఉంది.

వ్యవసాయ పనులు లేని రోజుల్లో



గతంలో ఉపాధిహామీ పనుల్లో కూలీలు

కూలీలకు ఆర్థిక తోడ్పాటు ఇవ్వడం కోసం వామపక్షాల చొరవతో ఉపాధి హామీ చట్టం అమలులోకి వచ్చింది. అయితే దీన్ని పాలకులే నిర్వీర్యం చేస్తూ పేదల ఉపాధిని దెబ్బకొడుతున్నారు. దీనికితోడు స్థానికంగానూ చట్టం అమలులో నెలకొన్న నిర్లక్ష్యం కూలీలకు శాపమవుతోంది. గతేడాది పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీకింద రూ.85 కోట్లు కేటాయించగా ఈ ఏడాది కేటాయింపు రూ.45 కోట్లకు తగ్గింది. ఈ ప్రభావం గ్రామాలపై తీవ్రంగా పడింది. పని చేద్దామని ఉన్నా అధికారులు పనులు చూపకపోవడంతో కూలీలు తమ ఇంటి అవసరాలతోపాటు పిల్లల చదువులు, ఇతర ఖర్చులకు అప్పులు చేయక తప్పని పరిస్థితి. ఈ అప్పులే వారిని రాజకీయ ఘర్షణల్లోకి లాక్కెళ్తున్నాయి. అవసరానికి ఏదో ఒక రూపంలో డబ్బులిచ్చే వారి పక్షాన రాజకీయ ఘర్షణల్లో పాల్గొనేలా పురిగొల్పుతున్నాయి.

ఈ పరిస్థితులన్నీ కలిసి పల్నాడు ప్రాంతంలో కొంత కాలంగా నిద్రాణంగా ఉన్న ఫ్యాక్షన్ వివాదాలను తెరపైకి తెస్తోంది. ఆర్థిక అవసరాలున్న జనాలను కొందరు నాయకులు తమ రాజకీయ అవసరాల కోసం ఘర్షణల వైపు మళ్లిస్తున్నారు. ఈ తగువుల్లో కొందరు భౌతికంగా గాయపడుతుంటే మరికొందరు జైళ్లపాలై వారి కుటుంబాలే ఛిన్నాభిన్నమవుతున్నాయి. వారి పిల్లల పైనా ఇది తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోంది. సరైన ఉపాధి, ఉద్యోగం లేని యువత సైతం ఈ రాజకీయ ఘర్షణల్లో పావులుగా మారి తమ భవిష్యత్‌నూ నాశనం చేసుకుంటున్నారు.

ఓట్ల లెక్కింపు నేపథ్యంలోనూ ఘర్షణలకు అవకాశం ఉంటుందనే నిఘా వర్గాల సమాచారంతో వీటిని నియంత్రించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అయితే ఇదొక్కటే సరిపోదని, ఘర్షణలకు దారితీస్తున్న మూల కారణాలను అన్వేషించాలనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రజల ఆర్థిక స్థితిని మెరుగుపరచేందుకు సరైన చర్యలు తీసుకుంటే జనం స్వభావంలోనే మార్పు వస్తుందని, అదివారిని వివాదాలకు దూరంగా తీసుకెళ్తుందనే కొందరంటున్నారు. సాగుకు అనువైన పరిస్థితులు కల్పించడం, వ్యవసాయ పనుల్లేని రోజుల్లో ఉపాధి హామీ పనులను విస్తృతంగా కల్పించడం, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, పిల్లలకు నాణ్యమైన విద్య తదితర సదుపాయాల కల్పన ఇందులో ప్రధానాంశాలని చెబుతున్నారు.

అరెస్టులు - బైండోవర్లు

(మొదటి పేజీ తరువాయి)

తెరిచామని వివరించారు. అల్లర్లలో పాల్గొన్న వారిలో ఐదుగురిని బైండోవర్ చేయగా వారు మళ్లీ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినందుకు న్యాయస్థానంలో హాజరుపర్చి నోటీసులు జారీ చేశామని, కారును సీజ్ చేశామని చెప్పారు. సిట్ దర్యాప్తు చేసిన కేసులకు సంబంధించి 13 మందిని అరెస్టు చేశామన్నారు. మొత్తంగా గురువారం పల్నాడు జిల్లాలో 54 మందిని అరెస్టు చేశామన్నారు.

ఎమ్మెల్యే పిన్నెల్లికి హైకోర్టులో ముందుస్తు బెయిల్

రెంటచింతల మండలం పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం, వివిప్యాట్ మిషన్ల ధ్వంసం కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ముందస్తు బెయిల్ కోసం గురువారం హైకోర్టును ఆశ్రయించారు. ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయగా దాన్ని హైకోర్టు అనుమతించింది. విచారణ అనంతరం జూన్ 5వ తేదీ ఉదయం 10 గంటల



వరకు ఆయనపై ఎటువంటి చర్యలూ తీసుకోవద్దని పోలీసు అధికారులను, ఈసీని కోర్టు ఆదేశించింది. మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రామకృష్ణారెడ్డి అరెస్టుపై రెండ్రోజులుగా కొనసాగుతున్న హైడ్రామాకు తెరపడింది. గురువారం నరసరావుపేట కోర్టులో రామకృష్ణారెడ్డి లొంగిపోతున్నారని ప్రచారం జరగ్గా అక్కడ పోలీసులు భారీగా మొహరించారు. ఆయన ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయి పార్టీకి చెందిన సీనియర్ నాయకుల ద్వారా బెయిల్ కోసం ప్రయత్నించి సఫలీకృతులయ్యారు. నర్సరావుపేటలో జరిగిన అల్లర్లకు సంబంధించి ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి కూడా హైకోర్టు ఉత్తర్వులతో ఊరట లభించినట్లయింది.

పోలింగ్ అధికారుల సస్పెన్షన్

మాచర్ల నియోజకవర్గంలో పాల్వాయి గేటు వద్ద ఉన్న పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన సత్తెనపల్లి జిజెసి జూనియర్ కళాశాల జూనియర్ లెక్చరర్ ఆఫీసర్ పివి సుబ్బారావు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన వెంకటాపురం జెడ్‌పి హైస్కూల్లో టీచర్ షేక్ షహనాజ్ బేగంను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లత్కర్ గురువారం సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈపోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎం ధ్వంసం చేసినా సకాలంలో కచ్చితమైన సమాచారంతో ఫిర్యాదు చేయకపోవడం, ఎమ్మెల్యే పోలింగ్ కేంద్రంలోకి రాగానే లేచి నిలబడి నమస్కారం చేయడం కూడా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని వచ్చిన ఫిర్యాదులపై వీరిని సస్పెండ్ చేయాలని ఈసి ఆదేశించింది.

రాంబాబు రీపోలింగ్ పిటీషన్ డిస్మిస్

సత్తెనపల్లి నియోజకవర్గంలో అల్లర్లు జరిగిన నాలుగు పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ జరపాలని వైసిపి అభ్యర్థి, మంత్రి అంబటి రాంబాబు దాఖలు చేసిన పిటీషన్‌పై హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యాక ఈ దశలో జోక్యం చేసుకోలేమంటూ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.

కౌంటింగ్ ఏజెంట్లూ ఇవి గుర్తుంచుకోండి...

ప్రజాశక్తి-విజయవాడ

ఎన్నికల ఫలితాలు వెల్లడించే సమయంలో వివిధ పార్టీల ఏజెంట్లు పలు అంశాలను గమనంలో ఉంచుకోవాలి. ఫారం 17సి, కంట్రోల్ యూనిట్ సీలు, అధికారుల సంతకాలు, ఓట్ల నమోదు సంఖ్య తదితర అంశాలను క్షుణ్ణంగా గమనించిన తరువాతే కౌంటింగ్‌కు సంసిద్ధత తెలపాల్సి ఉంది.

కౌంటింగ్‌కు ముందు...

1.ఫారం 17సి దగ్గర ఉంచుకోవాలి. ఎన్నికలు అయిన తేదీ నాడే ప్రిసైడింగ్ అధికారి ఏజెంట్లతో సంతకం చేసినదే తీసుకోవాలి. ఈ ఫారం 17సి ఏజెంట్లు సంతకాలు లేనిదైతే ఏదో అవకతవకలు జరిగినట్లు భావించాలి.

2. ప్రతి పోలింగ్ కేంద్రంలోని ఫారం 17సిలో ఉన్న కంట్రోల్ యూనిట్ నెంబరు, మిషన్ పైన ఉన్న నెంబరు సరి చూసుకోవాలి. పోలింగ్ రోజున ఏదైనా సమస్య వచ్చినప్పుడు కంట్రోల్ యూనిట్ మార్చినా అది ఫారం 17సి మార్చినట్లు చూపించి ఉండాలి. ఒక వేళ ఆ నెంబరు మ్యాచ్ కాకపోతే కౌంటింగ్ ఆపి ఆర్ఓతో సంప్రదించి కౌంటింగ్ ప్రారంభించాలి.

3. ఫారం 17సిలో నమోదైన ఓట్ల సంఖ్య, కంట్రోల్ యూనిట్‌లో చూపిస్తున్న ఓట్ల సంఖ్య సమానంగా ఉండాలి. ఒక వేళ లేకపోతే రిటర్నింగ్ అధికారిని అడిగి నివృత్తి చేసుకున్న తర్వాత కౌంటింగ్ ప్రారంభించాలి.

4. కంట్రోల్ యూనిట్‌కు ఉన్న అన్ని సీళ్లను ఫారం 17సీలో వున్న నెంబర్లతో సరిగా ఉన్నాయా లేదా ఖచ్చితంగా సరిచూసుకోవాలి.

5. మిషన్ పైన సీళ్లు ఏవైనా చిరిగి ఉన్నాయా లేదా తనిఖీ చేసుకోవాలి. ఇది అతి ముఖ్యమైన అంశం.

6. కంట్రోల్ యూనిట్ అన్ని సీళ్లపై ఏజెంట్లు, అధికారుల సంతకాలు ఉంటాయి. అవి సరిగ్గా ఉన్నాయా లేదా సరిచూసుకోవాలి. అనుమానం వస్తే నివృత్తి చేసుకొన్న తర్వాతే కౌంటింగ్ ప్రారంభించాలి.

7. పోలింగ్ సమయంలో ఏదైనా పోలింగ్ కేంద్రంలో సాంకేతిక కారణాలతో మరో మిషన్ వాడి ఉంటే, వాటి వివరాలు కూడా ఫారం 17సీ నమోదు చేసి వాటి వివరాలు కూడా సరి చూసుకోవాలి.



రిజల్ట్ బటన్ నొక్కిన తర్వాత గుర్తించాల్సిన అంశాలు

1. నియోజకవర్గంలో నోటాతో కలిపి పోటీ చేస్తున్న అభ్యర్థుల సంఖ్యను చూపించాలి.

2. పోలింగ్ కేంద్రంలో నమోదైన ఓట్ల సంఖ్య 17సీలో పోలైన ఓట్లతో సమానంగా ఉండాలి.

3. కంట్రోల్ యూనిట్‌లో పోలింగ్ తేదీ, పోలింగ్ ప్రారంభం, ముగింపు సమయం గంటలు, సెకన్లతో సహా చూపిస్తుంది. వాటిని సరిచూసుకోవాలి.

పైన తెలిపిన అన్ని విషయాలపై సంతృప్తి చెందినట్లు అయితేనే ప్రతి రౌండ్‌లో కౌంటింగ్ ప్రక్రియను ప్రారంభించడానికి సంసిద్ధత తెలపాలి.

సిఆర్‌పిఎఫ్ నీడలో రెంటచింతల

ప్రజాశక్తి - రెంటచింతల

ఈనెల 13న పోలింగ్ సందర్భంగా వివిధ గ్రామాల్లో ఘర్షణలు జరిగిన నేపథ్యంలో సిఆర్పిఎఫ్ బలగాలు రంగప్రవేశం చేశాయి 11 గ్రామాల్లో పర్యటించి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు ఎటువంటి మారనాయుధాలు ఉన్న స్వచ్ఛందంగా ఇవ్వాలని కోరుతున్నారు తమ తనిఖీల్లో బయటపడితే హిస్టరీ షీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరిస్తున్నారు.

500 మంది బైండోవర్

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పరిధిలోని నకరికల్లు,రాజుపాలెం, ముప్పాళ్ళ, సత్తెనపల్లి రూరల్ మండలంలోని 500 మంది పై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు సత్తెన పల్లి సర్కిల్ సిఐ ఎమ్ రాంబాబు తెలిపారు.సత్తెనపల్లి లో సిఐ రాంబాబు గురువారం మాట్లాడుతూ మే 13 న జరిగిన ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడిన వారిని గుర్తించినట్లు చెప్పారు. ముప్పాళ్ళ మండలలో 11 మందికి బాండ్స్ అమౌంట్ చెల్లించమని తహసిల్దార్ నోటీసులు జారీ చేసనట్లు తెలిపారు. రాజుపాలెం లో కూడా మరో 5 గురికి నోటీసులు ఇచ్చామని వారిపై రౌడీ షీట్స్ ఓపెన్ చేయ నున్నట్లు వెల్లడించారు.మరికొందరిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసేందుకు పై అధికారులకు నివేదిక పం పినట్లు తెలిపారు.



చిలకలూరిపేటలోని చార్లెస్ కాన్వెంట్ ఎదురుగా ఉన్న దాసరి కాలనీ

వర్షపు నీటి నిల్వలతో ఇబ్బంది

- దోమలు, దుర్వాసనతో అవస్థ
- బ్లీచింగ్, ఫాగింగ్ చేయండి
- చిలకలూరిపేటలోని లోతట్టు ప్రాంతాల ప్రజల వినతి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణములో లోతట్టు ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా ఉండేటట్లు పారిశుధ్య నిర్వహణ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. చిన్నపాటి జల్లుకే లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటుందని దీని వల్ల దోమలు, దుర్వాసన వచ్చే అవకాశా లున్నా యంటున్నారు. బ్లీచింగ్, దోమల నివారణకు పాగింగ్ చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతానికి పడుతున్న వర్షాల వల్ల నీరు కలుషిత మౌతుందని, ఆ నీరు ప్రజలు తాగడం వల్ల అనేక రోగాలు, శరీర రుగ్మతలు వస్తాయని పట్టణములోని ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు, డాక్టర్ కొల్లా అ మర్ చెప్పారు. పసి పిల్లలు,వృద్ధులు, బాలింతలు ఈ సమయాల్లో చాలా జాగ్ర త్తగా ఉండాలి అన్నారు. నీరు మురుగు నీటితో కలవడం వల్ల ఆ నీటిలో ఉండే చెడు బ్యాక్టీరియా మన శరీరంలోకి ప్రవేశించి అనేక రోగాలకు కారణ మౌతుందన్నారు. జలుబు,దగు,కొద్దిపాటి శరీర నీరసం,జ్వ రాలు వస్తా యన్నారు. కాబట్టి సీజన్ మారే టప్పుడు కొన్నిజాగ్రత్తలు పాటించటం తప్పని సరి అన్నారు. ఈ సమయాల్లో ప్రజలు కొద్దీపాటి కాచి వడకట్టైన నీరు మాత్రమే తాగాలని చెప్పారు. 40 సంవత్సరాలు దాటిన వారు శక్తి కోసం కొన్ని రోజులు బికాంప్లెక్స్ టాబ్లెట్స్ వాడాలన్నారు. లేదా గ్లూకోజ్ వాట ర్ తాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యం కాపాడుకోవాలని చెప్పారు.



వేలూరు రహదారి పక్కనే బాలాజీ థియేటర్ వద్ద చిన్నచిన్న గుడారాలలో నివసిస్తున్న గుడిపూడి జంగాలు

గుంటూరులో భారీ అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరులోని ప్రగతినగర్‌లో గురువారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. గతంలో చేపట్టిన యూజిడి ఉపయోగించిన పైపులు ఈ ప్రమా దంలో దగ్ధమయ్యాయి. ఈ పనులను చేపట్టిన కాంట్రాక్టు సంస్థ అర్ధంతరంగా పనులు నిలిపి వేయడంతో కొంత మెటీరియల్ ప్రగతి నగర్ డంపింగ్ యార్డు లో వదిలేసి వెళ్లిపోయారు. గురువారం గుర్తుతెలియని వ్యక్తుల నిర్లక్ష్యంతో నిప్పురవ్వలు వేయడం వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని, నష్టం రూ. లక్షల్లో ఉంటుందని అధికారలు అంచనా వేస్తున్నారు. గుంటూరు అగ్ని మాపక అది . కారులు ఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించారు.

ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్‌ల జోరు

ప్రజాశక్తి-చిలకలూరిపేట



జూన్ 4న వెలువడనున్న ఎన్నికల ఫలితాలపై ప్రధాన రాజకీయ పార్టీల్లో ఏ పార్టీ విజయం సాధిస్తుందనే దానిపై పట్టణ,నియోజకవర్గ స్థాయిలో రాజకీయ బెట్టింగ్ రాయుళ్లు చెలరేగి పోతున్నారు.నిన్న మొన్నటి దాకా వందలు,వేలు దాటిన వీరు ప్రస్తుతానికి లక్షల్లో బెట్టింగ్‌లు కాస్తున్నారు. అగ్రిమెంట్ బాండ్ పేపర్లపై రాసుకుని మరి బెట్టింగ్‌లకు పాల్పడు తున్నారు. వీరికి మళ్ళీ మధ్యవర్తులు హామీలు. వారికి 10 శాతం కమిషన్ ఇస్తున్నట్లు సమాచారం. పట్టణం లో ప్రముఖ సెంటర్లు మాస్ కు అయితే విశ్వనాథ్ థి యేటర్,గడియార స్తంభం సెంటర్, కళామందిర్ సెంటర్ ల లోనే కాక ప్రముఖ కూరగాయల మార్కెట్ లో కూడా ఈ పందేలా జోరు నడుస్తోందని సమాచారం. వీరందరూ సాయంత్రానికి రిజిస్టర్ కార్యాలయం వద్దకు చేరి బెట్టింగ్‌ల అగ్రిమెంట్‌లు చేయిస్తున్నారు. ఈ మధ్య ఎన్నికల కారణంగా రిజిస్ట్రేషన్లు పెద్దగా జరగలేదు. దీంతో, స్టాంపు రైటర్లు,వెండర్లు ఖాళీగా ఉన్నారు. బెట్టింగ్‌ల పుణ్యమా అని స్టాంపులు అమ్మకం దార్లు, స్టాంపులు రాసే వారు కొద్దిపాటి బిజీ అయ్యారని వార్తలు వినిపిస్తున్నాయి.

ఎపిఆర్‌డిసి ప్రవేశాల కోసం కౌన్సెలింగ్

ప్రజాశక్తి-గుంటూరు

నాగార్జున సాగర్‌లోని ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజిలో ప్రవేశాల కోసం గురువారం స్థానిక పాతబస్టాండ్ వద్ద గల పరీక్షా భవన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రెసిడెన్సియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషనల్ సొసైటీ సెక్రెటరీ ఆర్.నరసింహారావు, జాయింట్ సెక్రెటరీ హెచ్.ఎమ్‌డి.ఉబెదుల్లా ఎపిఆర్‌డిసి ప్రిన్సిపాల్ వై.ఎన్.ఎస్.చౌదరి, లైజనింగ్ ఆఫీసర్ డాక్టర్ పి.వి.మల్లేశ్వర్ కౌన్సెలింగ్‌ను పర్యవేక్షించారు. బిఎ, బి.కాం, బిఎస్‌సి కోర్సులలో మొత్తం 152 సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.



ధ్రువీకరణ పత్రం అందచేస్తున్న ఎపిఆర్‌ఇఐఎస్ సెక్రెటరీ నరసింహారావు, తదితరులు

క్షయ కేసుల సంఖ్య తగ్గించేందుకు అడల్ట్ బిసిజి టీకా

క్రోసూరు ప్రాథమిక వైద్యాధికారి బాల అంకమ్మబాయి

ప్రజాశక్తి - క్రోసూరు



జాతీయ టిబి నిర్మూలన లక్ష్యాన్ని సాధించేందుకు 2025 వ సంవత్సరం నాటికి క్షయ వ్యాధిని అంతం చేయడానికి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ భారతదేశ ప్రభుత్వం/రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి బలహీనమైన వ్యక్తులకు,పెద్ద వయసు ఉన్నవారికి బీసీజీ టీకాను ఇవ్వాలని నిర్ణయించినట్లు పల్నాడు జిల్లా కోసూరు మండలం క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని బాల అంకమ్మ బాయ్ గురువారం తెలిపారు టిబి వ్యాధి రావడానికి ఎక్కువ అవకాశం ఉన్న పెద్ద వయసు ఉన్న వారికి బిసిజి టీకా ఇవ్వడం ద్వారా సమాజంలో కొత్త టిబి కేసుల సంఖ్య తగ్గింపు జరుగు తుందన్నారు ఈ వయోజన బీసీజీ టీకా వేయించుకోవడానికి అర్హులైన వారి గురించి ఆమె వివరించారు.

మధుమేహ వ్యాధిగ్రస్తులు, 60 సంవత్సరముల వయసు దాటిన వారు అందరూ, గత ఐదు సంవత్సరముల క్రితం 18 సంవత్సరములు నిండిన టీబి వ్యాధికి గురైన వారు, 1 జనవరి 2021 తర్వాత టిబి వ్యాధికి గురైన వారి కుటుంబ సభ్యులకు ,వారితో అత్యంత సన్నిహితంగా ఉన్న వారికి, బాడీ మాస్ ఇండెక్స్ 18 కేజీలు/చదరపు మీటరు కన్నా తక్కువ ఉన్నవారికి, గతంలో గాని ఇప్పుడు గాని పొగతాగే అలవాటు ఉందని స్వచ్ఛందంగా తెలిపిన వారికి ఈ అడల్ట్ బిసిజి టీకా కు అర్హులని అన్నారు. ఈనెల 30వ తేదీ గురువారం మండలంలోని అన్ని సచివాలయాల్లో మళ్లీ ఈ వయోజనుల బీసీజీ టీకా కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మాట్లాడుతూ వయోజన బీసీజీ టీకా వేయించుకోవడానికి అర్హులు కాని వారి గురించి ఆయన వివరించారు. 18 ఏళ్ల లోపు వయసు ఉన్న వ్యక్తులు, హెచ్ఐవి సోకిన వారు, గర్భ వతులు, గుండె సంబంధిత వ్యాధులకు చికిత్స తీసుకుంటున్న వారు, డయాలసిస్ కానీ క్యాన్సర్ వ్యాధికి చికిత చేయిం చుకుంటున్న వారు ఈ వ్యాక్సిన్ వేయించుకోకూడదని అన్నారు. ఈ వయోజన బీసీజీ టీకా కోసం ప్రతి సచివాలయం ఆరోగ్య కార్యకర్తను గాని ఆశా కార్యకర్తను గాని సంప్రదించాల్సిందిగా సూచించారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



సత్తెనపల్లిలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

టిడిపి నాయకులకు పోలీస్ నోటీసులు జారీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

టిడిపి నాయకులు చలో మాచర్ల కు పిలుపు నిచ్చిన నేపథ్యంలో పోలీసులు పలువురు టిడిపి నేతలకు గురువారం నోటీసులు జారీ చేశారు.మాచర్లవెళ్ళేందుకు అనుమతి లేదని కాదని వెళితే కేసులు నమోదు చేస్తామని సత్తెనపల్లి పట్టణ సిఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ క్రమంలో పట్టణ పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు.నరసరావుపేట చెక్ పోస్ట్ సెంటర్లో పోలీసులు మాచర్ల వైపు వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.పట్టణ ఎస్ఐ సంధ్యారాణి ఎస్ఐ సత్యనారాయణ లు తనిఖీల్లో పాల్గొన్నారు.



లింగంగుంట్లలో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని లింగంగుంట్ల గ్రామంలో గురువారం పోలీసులు తనిఖీ చేశారు. పెదకూరపాడు మండల ఎస్సై వెంక ేట్రావు ఆధ్వర్యంల ఈ తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేసినట్లు ఆయన వివరించారు. ఎవరైనా చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్ట పరమైన చర్యలు ఉంటాయన్నారు. గ్రామాలలో అను మానాస్పదంగా తిరిగే వారి వివరాలు తెలియచేయాలని కోరారు. అలా తెలిపిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.



నాగార్జున కొండ కట్టడాలను సందర్శించిన టిబెట్ బౌద్ధ భిక్షువులు

శ్రీపర్వత - విజయపురి చరిత్రను వివరించిన శివనాగిరెడ్డి

ప్రజాశక్తి- విజయపురిసౌత్

నాగార్జునసాగర్ లెఫ్ట్ బ్యాంకులో తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన బుద్ధవనం వద్ద జరిగిన 2568వ బుద్ధ జయంతి వేడుకల్లో ప్రత్యేక అతిథులుగా పాల్గొన్న టిబెటన్ బౌద్ధ భిక్షువులు (విజయపుసౌత్) అనుపు వద్దగల బౌద్ధ కట్టడాలను సందర్శించారు. ఈ విషయాన్ని బుద్ధవనం కన్సల్టెంట్ , ప్లీచ్ ఇండియా, సీఈఓ, డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. శుక్రవారం నాడు బుద్ధ వనంలో బుద్ధ జయంతి సందర్భంగా మహా యాన సాంప్రదాయ ప్రకారం బుద్ధ వందనం కార్యక్రమం నిర్వహించారు. మైసూరు సమీపంలోని బైలుకుప్పేలోని సెరా టిబెటన్ బౌద్ధారామానికి చెందిన గేషే నవాంగ్ జుంగ్నె,జంపాకుంగ అనే బౌద్ధ భిక్షు వులకు, నాగార్జునకొండలో తిరుగాడిన ఆచార్య నాగార్జునడు, శ్రీ పర్వత విజయపురిలో విలసిల్లిన ఇక్ష్వాకుల కాలం (క్రీ.శ. 3వ శతాబ్దం) నాటి బౌద్ధ చరిత్ర, కట్టడాలు, శిల్పాలు, శాసనాలు, స్తూపాలు, చైత్యాలు, విహారాల గురించి శివనాగిరెడ్డి వివరించారు. బుద్ధునికి, ఆచార్య నాగార్జునకి, అనుపు బౌద్ధారామం వద్ద బౌద్ధ భిక్షువులు సందర్శించారు. బుద్ధ జయంతి రోజున నాగార్జునకొండ బౌద్ధ క్షేత్రాన్ని సందర్శించడం తమకు ఎంతో సంతోషాన్నిచ్చిందని, మహాయాన సిద్ధాంతకర్త, మాధ్యమిక, శూన్య వాదాలను స్థిరీకరించిన ఆచార్య నాగార్జునుడు తమకు అత్యంత గౌరవనీయుడని వారు చెప్పారు. కార్యక్రమంలో ఎఎస్ఐ కి చెందిన వెంకటేశ్వర్లు, బౌద్ధాభిమానులు గ్రంధి రామకృష్ణ, నాగార్జున పాల్గొన్నారు.



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న చిత్రం

బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలి


ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

బడి బయట ఉన్న పిల్లలను అందరిని బడిలో చేర్పించాలని భట్లూరు గ్రామ పంచాయతి కార్యదర్శి కృష్ణ ప్రసాద్ తల్లిదండ్రులకు సూచించారు. సత్తెనపల్లి మండలం భట్లూరులో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యా చైతన్య ప్రచారోద్యమ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుంటూరు, పల్నాడు జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షత వహించారు. ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రదీప్ మాటాడుతూ ప్రతి ఒక్కరూ బడికి వెళ్లి చదువుకోవడం వలన సమాజంలో గౌరవంగా జీవిస్తారని అన్నారు. చదువుకోవడం వలన పరిశుభ్రత, ఆరోగ్యం తదితర అంశాలపై అవగాహన కలిగి ఉంటారని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించి ప్రభుత్వం వస్తున్న అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుక వంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మాచర్ల నియోజకవర్గంలో

ప్రశాంత ఎన్నికలు కష్టమేనా?

- **జరిగిన ప్రతి ఎన్నికా రక్తసిక్తమే**
- **అధిపత్య పోరులో సమిధలుగా సాధారణ కుటుంబాలు**
- **ఓటున్నా ఓటు వేయలేని నిస్సహాయులు ఎందరో!**



ప్రజాశక్తి-మాచర్ల

వెనుకబాటుతనం, కక్ష్య కార్పణ్యాలతో, ఫ్యాక్షన్ తగదాలకు నిలయంగా మారిన మాచర్ల నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రతి ఎన్నికల సమయం రణ రంగం గానే జరుగుతోంది. ఈవీఎంలను పగలగొట్టడం వంటి ఘటనలు ఇదే మొదటిసారి కాదు. 2016 మాచర్ల పుర పాలక సంఘానికి జరిగిన ఎన్నికల సందర్భంగా తహాశీల్దార్ కార్యాలయాన్ని ఆనుకోని ఉన్న గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లలో కళ్ళకుంటకు చెందిన వారు దొంగ ఓట్లు వేస్తున్నారంటూ ఆగ్రహంతో మాజీ ఎమ్మెల్యే ఒకరు పోలింగ్ బూత్‌లోని ఈవీఎంని పగలగొట్టారు. దశాబ్దల నుండి ఎన్నికల సందర్భంగా దాడులు, ప్రతిదాడులు సర్వ సాధారణమయ్యాయి. టిడిపికి అధిపత్యం ఉన్న గ్రామాలలో ప్రతిపక్ష పార్టీని ఓటు వేసుకోన్వికుండా చేయడం, అలాగే వైసిపికి అధిపత్యం ఉన్న గ్రామాల్లో టిడిపి వారిని కనీసం ఏజెంట్లుగా కూడ ఉండకుండా చేయడం వంటి ఘటనలు పరిపాటిగా మారాయి. తాజాగా జరిగిన



ఎన్నికలలో వైసిపికి అధిపత్యం ఉన్న కళ్ళకుంట, కెపి గూడెం, రెంటాల తదితర గ్రామాల్లో తెలుగుదేశం ఏజెంట్లపై దాడులు చేయడం, ఆయా గ్రామాల్లోని టిడిపి వారు ఓటింగ్‌కు రాకుండా వారిపై దాడులు చేసి అడ్డుకోవడం జరిగింది. ఇదే మాదిరిగా టిడిపికి అధిపత్యం ఉన్న గ్రామాల్లో వైసిపికి చెందిన పోలింగ్ ఏజెంట్లపై దాడులు చేయడం, వైసిపి కి అనుకూలంగా ఉన్న వారిని ఓట్లు వేసేందుకు రాకుండా అడ్డుకోవడంతో ఘర్షణలు జరిగాయి. గ్రామాలలో జరిగిన ఆయా ఘర్షణలకు ప్రధాన కారణం ఇదే. తమ నాయకుడిని గెలిపించుకునేందుకు ఆయా పార్టీలకు చెందిన అభిమానులు ఎన్నికల రోజున ఎంతటికైనా తెగించటానికి సిద్ధపడుతున్నారు. వారిని కేసులలో నుండి బయటకు వేసేందుకు, వారిని కాపాడుకునేందుకు ఆయా పార్టీల నాయకులు కూడా కృషి చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఎన్నికల పరిస్థితి సాధారణ పౌరులు, సాధారణ పార్టీలు ఎన్నికల వైపునకు చూడలేని పరిస్థితికి చేరుకున్నాయి. గతంలో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల మధ్య ఘర్షణలు జరిగేవి. కాంగ్రెస్ కను మరుగై వైసిపి ప్రాభవం పెరగడంతో ఇప్పుడు



వైసిపి, టిడిపిల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది.

ఎన్నికలలో గెలుపొందడమే లక్ష్యంగా పెట్టుకున్న ఆయా పార్టీల నాయకులు, తేందుకు ఏవిధంగా ముందుకెళ్లాలనే దానిపై దృష్టి పెడుతూ కేవలం ఎన్నికల సమయంలోనే కాకుండా నిరంతరం అదే పనిలో ఉంటున్నారు. ఈ క్రమంలో ఆయా గ్రూప్‌లలో ఉన్న బలమైన నాయకులను తమ వైపునకు తిప్పుకునేందుకు, లేదా సదరు గ్రూప్‌లలో ఘర్షణలు పెట్టి, విభేదాలు సృష్టించి విడగొట్టడం ద్వారా వారిని తమ వైపునకు తిప్పుకునే నిరంతర ప్రయత్నాలు చేస్తున్నారు. తమకు అనుకూలమైన వారి ఓట్లు ఉంచడం, అనుకూలంగా లేని వారు ఓట్లు తొలగించడం వంటివి, తమకు అనుకూలంగా ఉన్న వారికి రెండు, మూడు చోట్ల కూడా ఓట్లు సృష్టించడం వంటి పనులకు పాల్పడుతున్నారు.

ప్రతిపక్ష పార్టీల వారు, ఓటర్లు ఓటు హక్కును కాపాడుకోవడం బ్రహ్మప్రళయంగా మారింది. ఇందు కోసం ధర్నాలు, ఆందోళనలు చేసే పరిస్థితి. ఎన్నికల సందర్భంగా ఎంత హింస జరిగినా ఆయా ఘర్షణలలో పాల్గొన్న వారికి ఎటువంటి శిక్షలు పడకపోవటమే, తదుపరి ఎన్నికల్లో హింస మరింత పెరగటానికి కారణంగా మారింది. చిన్న పార్టీలు ఎన్నికల వైపునకు చూడాలంటేనే భయపడే పరిస్థితులు ఉన్నాయి. ఘర్షణలకు అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలకు అధికార యంత్రాంగం కూడా తోడై పని చేస్తుండటంతో ప్రతిపక్ష పార్టీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. అధికారం లేనప్పుడు పార్టీని కాపాడు కోవడం పెద్ద సమస్యగా మారింది. మాచర్ల నియోజకవర్గంలో ప్రధానంగా రెడ్డి, కమ్మ సామాజిక తరగతుల మధ్య పోరు నడుస్తోంది. రెడ్డి సామాజిక తరగతి ఆధిపత్య గ్రామాలైన కళ్ళకుంట, కెపి గూడెం, మిర్యాల, రెంటాల, రెడ్డిపాలెం, లక్ష్మిపురం, గన్నవరం, మంచికల్లు తదితర గ్రామాల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలను ఓటు వేయకుండా నిలువరించి అధిపత్య కులాల వారే వారి ఓట్లను వేసుకోవడం(రిగ్గింగ్) ఆనాదిగా వస్తుంది. అలానే కమ్మ సామాజిక తరగతి అధిపత్య గ్రామాలైన బోదిలవీడు, లోయపల్లి, ముటుకూరు, అడిగొప్పల, ఒప్పిచర్ల, వెపంకంపల్లి, ఓబులేశునిపల్లె, చింతపల్లి, తుమృకోట తదితర గ్రామాల్లో బడుగు, బలహీన వర్గాల వారిని ఓటింగ్ రాకుండా ఏకపక్షంగా రిగ్గింగ్ చేయటం జరిగేది. ఆయా గ్రామాలలో కొన్ని అట్టడుగు సామాజిక తరగతులకు చెందిన కొందరు తమకు ఓటు హక్కు వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఓటు వేయలేని పరిస్థితులు ఉన్నాయి. ఈ గ్రామాలలో నిర్బంధం, నిర్బంధాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నక్సల్స్ 2004 వరకు బలమైన ఉదమాలు నిర్మించడంతో గ్రామాలలో అధిపత్యం చెలాయించే వారు నక్సల్స్ చేతిలో హతం కాగా, మరి కొందరు గ్రామా లు వదిలి వెళ్ళిపోయారు. దీంతో , గ్రామాల్లోని బడుగు, బలహీనవర్గాల వారికి ఒక ధైర్యంతో పాటు, ఎదిరించే శక్తి వచ్చింది. ఈ నేపథ్యంలో 2004లో జరిగిన ఎన్నికలలో పలు గ్రామాల్లో నిర్బంధాలు, దౌర్జన్యాలు తొలగడంతో ఫ్రీ ఓటింగ్ జరగటంతో చాలామంది తమ ఓటు హక్కు విని యోగించుకున్నారు. అనంతర పరిణామా లతో తిరిగి ఆగ్రవర్ణాల ఆధిపత్యంలోకి ఆయా గ్రామాలు వెళ్ళాయి. బ్యాలెట్ బాక్స్‌ల నుండి ఈవీఎంల వరకు ఎన్నికల సందర్భంగా హింస జరుగుతూనే ఉంది. అధికారుల వద్ద సమగ్రంగా ఈ వివరాలు అన్ని ఉన్నాయి. అయినా సరే ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించలేకపోవడం ఎన్నికల కమిషన్ వైఫల్యమని పలువురు విశ్లేషిస్తున్నారు.



పోలింగ్ సమయంలో అధికార, ప్రతిపక్షపార్టీలకు నాయకుల మధ్య జరిగిన దాడుల్లో గాయపడ్డ మహిళ

సాగుపై రైతుల్లో సంశయం

ప్రజాశక్తి-పెదకూరపాడు

రైతుల పరిస్థితి అమ్మబోతే అడవి కొనబోతే కొరివిగా తయారైంది. మండలంలో ముఖ్యంగా పెదకూర పాడు పరిసర గ్రామాల ప్రజలకు ఈ పరిస్థితి అతికినట్టు సరిపోతుంది. ఈ ప్రాంతంలో గడిచిన ఐదేళ్లలో నాలుగు సంవత్స రాలు నష్టాలు సరి చూడవలసి వచ్చింది. ఒక సంవత్సరం మాత్రమే దిగుబడులు అంతంత మాత్రం ఉన్న పంటలకు ధర లభించింది. దీంతో లాభాలు బాట నడిచారు. మిగతా సంవత్సరాలు శ్రమ



కూడా రాని పరిస్థితి ఉంది. గడిచిన యాడాది పెదకూరపాడు పరిసర గ్రామాల ప్రజలు మిరప పంట, పత్తి పంట సాగు చేశారు. నాగార్జునసాగర్ నుండి నీరు సకాలంలో ఇవ్వకపోవడంతో మిరప రైతులు తీవ్రస్థాయిలో నష్టపోయారు. పాలకవర్గాల నుండి రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు గాని , మద్దతు ధర గాని లభించలేదు. ప్రత్తి, మిరప పంటలకు బీమా అందలేదు. ఒకవేళ అందినా కంటి తుడుపు చర్యగా ఉంది. దీంతో రైతులు గాని, కౌలు రైతులు గాని ఎవరు సాగు చేయడానికి సిద్ధంగా లేరు. పెద కూరపాడు ప్రాంతంలో భూములను ప్రకాశం జిల్లా ఇంకొల్లు మార్టూరు, తాడికొండ మండలంలోని ఉంగుటూరు ప్రాం తాల నుండి శనగ పంటకు వందలాది ఎకరాలు కౌలుకు తీసుకునే పరిస్థితి ఉంది. ఎకరం 5000 నుండి 14,000 వరకు తీసుకుంటున్నారు. రోడ్డు నుండి దూరాన్ని అనుసరించి కౌలు ధరలు మారు తున్నాయి.

సాగు చేసే వాతావరణం లేదు : మల్లేశ్వరరావు



సాగు చేయటానికి వాతావరణం అనుకూలంగా లేదని పెదకూరపాడుకి చెందిన రైతు నాగమల్లేశ్వరరావు అన్నారు. పెరిగిన పెట్టుబడి ఖర్చులు , ప్రభుత్వ ప్రోత్సాహాలు అంతంత మాత్రమే ఉండటం. వాతావరణం ప్రతికూలంగా ఉండటంతో చేయలేని పరిస్థితి వచ్చిందన్నారు. సాగు చేయాలని ఉన్న అందుకు తగ్గ పరిస్థితులు లేవన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో శనగ పంట గాని, ప్రత్తి గాని వేద్దామని ఆలోచిస్తానన్నారు.

జీతాల కోసం మున్సిపల్ కార్మికులు ధర్నా

ప్రజాశక్తి - మంగళగిరి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పెండింగ్ జీతాలను చెల్లించాలని, సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. ఈ సమస్యలపై పలుమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని సిఐటియు నాయకులు ఎస్ఎస్ చెంగయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ధర్నాలో సిఐటియు నాయకులు వై.కమలాకర్, యూనియన్ నాయకులు సిహెచ్ శివపార్వతి, ఎం.నరసింహారావు, సి.స్వామి, వి.అరుణ, ఎం.తిరుపతమ్మ, పి.వెంకటేశ్వర్లు, వై.దుర్గారావు పాల్గొన్నారు.



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నాలో కార్మికులు, నాయకులు

ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి ఫోన్లను అనుమతించం : జెసి

ప్రజాశక్తి - మంగళగిరి

ఓట్ల లెక్కింపు ప్రక్రియపై మంగళగిరి అసెంబ్లీ స్థానం ఎమ్మెల్యే అభ్యర్థులకు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా సంయుక్త కలెక్టరు జి.రాజకుమారి గురువారం అవగాహన కల్పించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జెసి మాట్లాడుతూ వచ్చేనెల 4వ తేదీన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ కాలేజీ సివిల్, మెకానికల్ బ్లాకు, రూమ్ నెంబరు-206, మొదటి అంతస్తులో ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతుందని, ఉదయం 6.30 గంటల కల్లా ప్రతి ఒక్కరూ కౌంటింగ్ హాలునకు చేరుకోవాలని చెప్పారు. మొబైల్ ఫోన్లకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. కౌంటింగ్ హాల్‌లో కౌంటింగ్ సిబ్బందికి ఆటంకం కలిగించని, కౌంటింగ్ హాలు ప్రశాంతతకు భంగం కలిగించని విధంగా ఏజెంట్లను నియమించుకోవాలని చెప్పారు. ఆర్‌వో కార్యాలయంలోని స్ట్రాంగ్ రూములో భద్రపరచిన పోస్టల్ బ్యాలెట్లను ఓట్ల లెక్కింపునకు ఒకరోజు



ముందు అంటే 3వ తేదీ సాయంత్రం అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో లెక్కింపు కేంద్రానికి తరలిస్తామని తెలిపారు. కౌంటింగ్ హాల్‌లో ఈవీఎం ఓట్ల లెక్కింపుకు 14 టేబుల్స్, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుకు 3 టేబుల్స్, ఇటిబిపిఎస్ లెక్కింపుకు ఒక టేబుల్ ను ఏర్పాటు చేశామని, టేబుల్ వారీగా కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకోవాలని చెప్పారు.

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని సందర్శించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవికుమార్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రామకోటిరెడ్డి ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక దర్శనం జరిపించి తీర్థప్రసాదాలను అందజేశారు.



దేవస్థానంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవికుమార్

క్షయ లక్షణాలుంటే టీకాలు వేయించుకోండి

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నోడల్ అధికారి డాక్టర్ ప్రశాంత్ సందర్శించారు. ఉండవల్లి సచివాలయంలో జరుగుతున్న క్షయ వ్యాధి నిర్మూలన, అవగాహన కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న వ్యక్తులు అందరూ టీకాలు వేయించుకోవాలని కోరారు. మద్యం, పొగాకు ఉత్పత్తులు వాడరాదని సూచించారు. దీర్ఘకాలంగా అలవాటు ఉండి మానుకోలేని వారికి అవసరమైతే డిఅడిక్షన్ సెంటర్‌లో కౌన్సెలింగ్ తీసుకోవాలన్నారు. ఆరోగ్యపరంగా, ఆర్థికపరంగా కుటుంబాన్ని మెరుగుపరుచుకునేలా కుటుంబ పెద్ద వ్యవహరించాలన్నారు. తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ శాంతకుమారి మాట్లాడుతూ 60 ఏళ్ల



పైబడిన వారు వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. షుగర్, ధూమపానం అలవాటు ఉన్న వారు వ్యాక్సిన్ వేయించుకోవాలని చెప్పారు. సిహెచ్ఒ గురుకుమార్ మాట్లాడుతూ వ్యాక్సిన్ వేయించుకున్న తరువాత పాటించాల్సిన జాగ్రతలను వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఎఎన్ఎంలు, సూపర్‌వైజర్‌లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

కాయ్ రాజా.. కాయ్..!

- ఎన్నికల ఫలితాలపై బెట్టింగుల జోరు
- ప్రభుత్వ మార్పు, అభ్యర్థుల గెలుపు, పార్టీ అధినేతల మెజారిటిపైనా భారీగా పందేలు

ప్రజాశక్తి-తెనాలి



కరెవరంలో బారులు తీరిన ఓటర్లు(ఫైల్)

సార్వత్రిక ఎన్నికల ఫలితాల ప్రకటనకు గడువు సమీపిస్తున్న కొద్దీ ఫలితాలపై బెట్టింగుల జోరు పెరుగుతోంది. ఎజూ.లక్షలతో ప్రారంభమైన బెట్టింగులు ఎజూ.కోట్లకు చేరుతున్నాయి. ప్రభుత్వం మారుతుందని ఒకవైపు, మరోవైపు అభ్యర్థుల గెలుపు, ఈ రెండింటినీ మించి ప్రధాన పార్టీ అధినేతల మెజారిటీపైనా బెట్టింగులు సాగుతున్నాయి. తెనాలి నియోజకవర్గం తెనాలి, కొల్లిపర ప్రాంతాల్లో ఎన్నికల్లో గెలుపోటములపై సాగుతున్న బెట్టింగుల వివరాలిలా ఉన్నాయి.

నియోజకవర్గంలో వైసిపి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, టిడిపి, జనసేన, బిజెపి కూటమి నుంచి జనసేన అభ్యర్థి నాదెండ్ల మనోహర్ పోటీలో ఉన్నారు. వీరికి తోడు బిఎస్పీ, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీలు, మరికొంత మంది ఇండిపెండెంట్లు బరిలో ఉన్న సంగతి తెలిసిందే. అయితే ప్రధాన పార్టీలైన వైసిపి, కూటమి మద్యే రసవత్తర పోరు సాగింది. గతంలో పోలింగ్ జరిగిన మరునాటికి ఏ పార్టీ గెలుస్తుంది, ఏ పార్టీ అధికారంలోకి రావచ్చన్నది పోలింగ్ సరళి ఆధారంగా విశ్లేషకులు చెప్పగలిగే వారు. కాని ఈ దఫా ఎన్నికల్లో విశ్లేషకులు సైతం ఓటరు నాడి పట్టలేకపోయారు. దీనికి తోడు పోలింగ్ సమయం ముగిసిన తరువాతా ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరటం, ప్రజలు ఓపిగ్గా ఓటు హక్కును వినియోగించుకోవటం, పోస్టల్ బ్యాలెట్లను గతం కంటే ఎక్కువగా ఉద్యోగులు ఉపయోగించుకోవటం, ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు సైతం ఓటింగ్‌కు తరలిరావటం ఈ ఎన్నికల్లో ప్రత్యేకతలుగా చొప్పొచ్చు. వాస్తవంగా ఓటింగ్ శాతం పెరిగిందంటే ప్రభుత్వంపై వ్యతిరేకతేనన్న సంకేతాలుగా చెప్పేవారు. కాని ఈ దఫా ఎన్నికల్లో పెరిగిన ఓటరు చైతన్యం ప్రభుత్వానికి అనుకూలమని వైసిపి అంటుంటే, కచ్చితంగా ప్రభుత్వంపై వ్యతిరేకతేనని కూటమి చెబుతోంది. దీనిపై విశ్లేషకులు కూడా స్పష్టంగా మాట్లాడలేని పరిస్థితి.

కొనసాగుతున్న బెట్టింగుల జోరు

నియోజకవర్గంలోని తెనాలి, కొల్లిపర మండలాల్లో ఎన్నికల ఫలితాలపై గణనీయంగా బెట్టింగులు సాగుతున్నాయి. గతంకంటే భిన్నంగా పెద్దమొత్తంలో పందెంరాయుళ్లు రంగంలోకి దిగినట్లు చెబుతున్నారు. నియోజకవర్గంలో వైసిపి గెలుస్తుందని, కాదు కూటమి గెలుస్తుందని, రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తుందని కొందరు పందెంకాస్తుంటే, వైసిపి మళ్లీ అదికారంలోకి వస్తుందని మరికొందరు పందెం కాస్తున్నారు. ఈ రెండింటినీ మించి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్, జనసేన అదినేత పవన్ కల్యాణ్‌ల మెజారిటీ కంటే సిఎం జగన్ మెజారిటీయే ఎక్కువ ఉంటుందని మరో గ్రూపు పందేలు కాస్తున్నట్లు సమాచారం. విజయవాడ మూడు స్థానాలు కూటమే గెలుస్తుందని, మూడు స్థానాల్లో వైసిపిదే విజయమంటూ కూడా పందాలు సాగుతున్నాయి.

ఉదాహరణకు తెనాలిలో శివకుమార్ గెలుస్తారని, వైసిపి అధికారంలోకి వస్తుందని రూ.లక్ష పందెం కాస్తే, దానికి ప్రతిగా కూటమి అభ్యర్థి మనోహర్ గెలుస్తారని, రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తుందని రూ.లక్షకు రూ.లక్షన్నర ఇచ్చేలా పందాలు సాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయల బెట్టింగులు సాగుతున్నట్లు సమాచారం. ఈ పందాల జోరు రోజురోజుకూ పెరగటం విశేషం. వాస్తవానికి నియోజకవర్గంలో కొల్లిపర మండలంలో వైసిపికి మెజారిటి వస్తుంది. అలాంటిది ఈ దఫా అక్కడ కూడా కూటమి గెలుస్తుందన్న పందేలు పెరగటం చర్చనీయాంశమైంది.



అనంతవరంలో నిరసన తెలుపుతున్న మహిళలు

వైసిపి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని రైతులు చేస్తున్న దీక్షలు గురువారంతో 1619వ రోజుకు చేరాయి. అమరావతి రాజధానిని నిర్వీర్యం చేసిన వైసిపి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని రైతులు స్పష్టం చేశారు. 2019 ఎన్నికలకు ముందు అమరావతి రాజధానికి అనుకూలంగా మాట్లాడి అధికారంలోకి వచ్చాక మూడు రాజధానులంటూ మాట మార్చిన జగన్మోహన్‌రెడ్డి రెండు నాల్కల ధోరణిని రాష్ట్ర ప్రజలు గమనించారని, ఆయన ప్రజల ఛీత్కారానికి గురికాక తప్పదని విమర్శించారు. తుళ్లూరు, వెంకటపాలెం, అనంతవరం, వెలగపూడి తదితర గ్రామాల్లో రైతుల ఆందోళనలు కొనసాగాయి. జై అమరావతి, బిల్డ్ అమరావతి - సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు, చిన్నారులు ప్ల కార్డులు ప్రదర్శించారు. అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

అభివృద్ధి, పారిశుధ్యంపై కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో పారిశుధ్యం, అభివృద్ధి అంశాలపై సిబ్బందితో మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న గురువారం సమీక్షించారు. పురపాలక సంఘ పరిధిలోని 25 వ వార్డు పినపాడు ప్రాంతంలో గురువారం కమిషనర్ పర్యటించారు. తడి, పొడి చెత్త సేకరణ అంశాలను పరిశీలించారు. కొడాలి వీరయ్య మున్సిపల్ పార్కును పరిశీలించారు. అనంతరం కౌన్సిల్ హాలులో సిబ్బందితో సమీక్షించి ఇంటింటి చెత్త సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైడ్ డ్రెయిన్ల శుభ్రత పై సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కొడాలి వీరయ్య పార్క్‌లో చిన్నారుల ఆట పాటలకు సంబంధించిన సామగ్రి సమకూర్చటం, మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనకు ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ అనూష, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కెహెచ్ నిర్మల, ఎసిపి-1 జడ్ సుధాకర్, ప్రణాళిక విభాగం, రెవెన్యూ, ప్రజారోగ్య విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణ మహోత్సవం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

మండలంలోని నాగులపాడులో స్వయంభు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మూలమంత్ర సహిత సర్ప సూక్త హోమం నిర్వహించారు. కమిటీ సభ్యులు, గుడివాడ సివిల్ కోర్టు జడ్జి ముతవరపు సుధారాణి దంపతులు పాల్గొన్నారు. శుక్రవారం జరిగే కల్యాణోత్సవంలో 46 మంది దంపతులు పాల్గొంటారని, కార్యక్రమంలో పాల్గొనే దూర ప్రాంతాల వారికి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేశామని పాలకమండలి చైర్మన్ సాంబశివరావు తెలిపారు.



నేటి నుంచి టెన్త్ అడ్వాన్స్ సప్లిమెంటరీ

ప్రజాశక్తి - రెంటచింతల

నేటి నుంచి టెన్త్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ- 2 శివ నాగేశ్వరరావు తెలిపారు. పరీక్షా కేంద్రం వై ఆర్ ఎస్ హై స్కూల్ కేటా యించామన్నారు. 9 మంది ఇన్విజిలేటర్లు నియమించామని మొత్తం 200 మంది విద్యార్థులు దాకా పరీక్షలు రాయ నున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులు అస్వస్థకు గురైతే అక్కడే వైద్య సిబ్బంది ఉంటుందన్నారు

శాఖా గ్రంథాలయంలో తనిఖీ

ప్రజాశక్తి - క్రోసూరు



క్రోసూరు శాఖ గ్రంథాలయాన్ని ఉమ్మడి జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వి. సుబ్బరత్నమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు ఇస్తున్న శిక్షణను పరిశీలించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై శిక్షణ శిబిరాన్ని ఉపయోగించుకునేలా చూడాలని గ్రంథాలయాధికారిణి వీరాంజమ్మకు సూచించారు. రీడర్స్ షిప్, మెంబర్ షిప్ పెంచాలని సూచించారు. గ్రంథాయాల సెస్సు వసూలయ్యేలా కృషి చేయాలని చెప్పారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

ప్రజాశక్తి-పెదకూరపాడు

వ్యవసాయ శాఖ ద్వారా 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ, జనుము మరియు పిల్లిపెసర ఆయా గ్రామ రైతుభరోసా కేంద్రంలో ఇస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఐ.శాంతి తెలిపారు. ఆమె గురువారం మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులకు జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు ఎకరాకు ఒక సంచి ఇస్తామన్నారు. 5 ఎకరాలు వరకు పరిమితి ఉందని తెలిపారు. జీలుగ, జనుము ఒక కేజీ ధర రూ.44 అని,10 కేజీల సంచులలో లభ్యమవుతాయన్నారు. పిల్లిపెసర ఒక కేజీ రూ.67 అని, 8 కేజీల సంచులలో ఉంటాయన్నారు. మండలంలోని విత్తనాలు కావలిసిన రైతులు రైతుభరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ లేదా ఉద్యాన సహాయకులను సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా వార్షిక మహోత్సవం

ప్రజాశక్తి-గురజాల

స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం 9వ వార్షికోత్సవ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. సందర్శకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.



వైభవంగా కళ్యాణ మహోత్సవం

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల మండలం అనుపులోని శ్రీదేవి భూదేవి సమేత రంగనాయకుల స్వామి కళ్యాణ మహోత్సవం గురు వారం ఘనంగా నిర్వహించారు. అర్చకులువేద పండి తులు జూనూతల. సుధాకర్ శాస్త్రి ఆధ్వర్యంలో ఈ మహో త్సవం జరిగింది. ఉదయం స్వామి వారికి గణపతి పూజ, పుణ్య వాచనం, నవగ్రహ మండపారాధన నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఎదురుకోలలు,రధోత్సవం,చక్రస్తానం ఘనంగా జరిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్య నిర్వహణ అధికారి వెంకటయ్య, అర్చకులు దత్తు,రాజా, సుధాకర్, కురిమేటి దత్తకుమార్ శర్మ,శ్రీ పాద శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు సమగ్ర ప్రణాళిక

సమీక్ష సమావేశంలో కలెక్టర్ శ్రీకేశ్ లత్కర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



సమీక్షలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్‌డిఒ

ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా చెప్పారు. ఓట్ల లెక్కింపుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం గాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యదర్శి సూచించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలు, ఆ కేంద్రంలో నిబంధనల మేరకు టేబుల్స్ ఏర్పాటు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు టేబుల్స్ ఏర్పాటుపై ఆయన పలు సూచనలు చేశారు. ముఖ్యంగా స్ట్రాంగ్ రూముల భద్రత, సి సి కెమెరాలు నిఘా ఉండాలన్నారు. ఎన్నికల పరిశీలకులు, అభ్యర్థుల సమక్షంలో పారదర్శకంగా ఓట్ల లెక్కింపు జరగాలన్నారు. ప్రతి అంశాన్ని వీడియోగ్రఫీతో చిత్రీకరించాలని సూచించారు. ర్యాండమైజేషన్ ద్వారా ఓట్ల లెక్కింపు సిబ్బంది నియామకం, బారికేడ్లు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈసిఐ మార్గదర్శకాల మేరకు జిల్లాలో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేశ్ లత్కర్ ఆయనకు వివరించారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపునకు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామంటూ కలెక్టర్ నివేదించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ జిల్లా రెవిన్యూ అధికారి పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ తల్లి మృతి

ప్రజాశక్తి-చిలకలూరిపేట





బాలమణి భౌతికకాయం వద్ద నివాళు లర్పిస్తున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

స్థానిక పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ కుల్లి చినబాబు తల్లి కుల్లి బాలమణి (70) మృతి చెందారు. స్థానిక సాంబశివనగర్‌లోని తన స్వగృహంలో బుధవారం తెల్లవారుజామున గుండె పోటీతో మృతి చెందినట్లు చినబాబు తెలిపారు. ఆమె భర్త ఇటీవలే మతి చెందారన్నారు. ఆమెకు ముగ్గురు పిల్లలు. ఆమె మృతికి ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మల్లెల రాజేష్ నాయుడు , పలువురు జర్నలిస్టులు నివాళులర్పించారు. చినబాబుతో పాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలిపారు. ఆమె అంత్యక్రియలలో వారు పాల్గొన్నారు.

నకిలీ, గుర్తింపు లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు : ఎడిఎ పి.మస్తానమ్మ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎడిఎ పి.మస్తానమ్మ

నకిలీ, గుర్తింపు లేని విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ ఏడిఏ పి.మస్తానమ్మ హెచ్చరించారు. నరసరావుపేటలోని పలు విత్తన,పురుగు మందుల దుకాణాలలో గురువారం ఎడిఎ పి.మస్తానమ్మ ఆకస్మిక దాడులు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుకాణదారులు నాణ్యమైన గుర్తింపు పొందిన విత్తనాలు పురుగు మందులు రైతులకు విక్ర యించాలని కొటేషన్ బిల్లు కాకుండా తప్పనిసరిగా వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి పొందిన రసీదు మాత్రమే ఇవ్వాలని బిల్లుపై తప్పనిసరిగా రైతు సంతకం చేయించాలని సూచించారు. విత్తన ప్యాకెట్ తూకం, తయారీ తేదీ, కాలం చెల్లె తేదీ, ధరలు దుకాణంలో నల్ల బోర్డుపై ప్రదర్శించాలని అధిక ధరలకు విక్రయించినా రికార్డులు సక్రమంగా లేక పోయినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా కంపెనీల అమ్మకపు అనుమతి పత్రాలు తప్పని సరిగా దుకాణంలో తనిఖీలకు వచ్చినపుడు తప్పనిసరిగా చూపించాలని, అమ్మకపు అనుమతి పత్రాలు లేకపోయినా బోర్డులో ప్రదర్శించిన నిల్వలకు రికార్డులలో నిల్వలకు వాస్తవ నిల్వలకు తేడా ఉన్నట్లు గమనిస్తే ఆయా నిల్వలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ గుర్తింపు, అనుమతి పొందిన విత్తనాలు మాత్రమే రైతులకు విక్రయించాలని రైతుల నుండి విత్తన మొలక, ఇతర ఫిర్యాదులు వస్తే దుకాణదారులు స్పందించాలని సూచించారు.

మాచర్లలో ఎన్నికల హింస, అల్లర్లపై ఈసీ మౌనమెందుకు?

నరసరావుపేట వైసిపి ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ మాచర్లలో జరిగిన ఎన్నికల హింసాత్మక ఘటనలు, అల్లర్లపై ఎన్నికల కమిషన్ మౌన మెందుకని నరసరావుపేట పార్లమెంట్ వైసిపి అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్ ప్రశ్నించారు. ఈ మేరకు చెన్నై నుండి ఆయన మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గంలో అధికారులను మార్చిన తర్వాత దాడులు, హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయని టిడిపి నేతలు అల్లర్లకు పాల్పడవచ్చని పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ముందు నుంచి ఈసీకి లేఖలు రాస్తూనే ఉన్నారన్నారు.

మాచర్లలో జరిగిన అన్ని సంఘటనలపై ఎన్నికల కమిషన్ సమాధానం చెప్పాలని అనీల్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. మాచర్లలో పలు ప్రాంతాలలో రిగ్గింగ్ జరుగుతుందని ఎస్సీ,ఎస్టీ,బిసిలపై దాడులు జరుగుతున్నాయని జిల్లా ఎస్పీకి ఫోన్ చేస్తే స్పందించలేదని, రిగ్గింగ్ చేస్తున్న చోట ఎస్పి సహకారం అందించారని, టిడిపి రిగ్గింగ్ పై ఎస్పి స్పందించకపోతే పిన్నెల్లి వెళ్లి అడ్డుకున్నారనిఅన్నారు. పాల్వాయి గేట్ వద్ద పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కొడుకు తల పగలకొట్టినా పోలీసులు స్పందించలేదన్నారు. పోలింగ్ రోజున రాష్ట్రంలో మొత్తం 9 ఈవీఎంలు ధ్వంసం అయితే పిన్నెల్లి వీడియో మాత్రమే ఎందుకు బయటకు వచ్చిందని, మిగిలిన 8 ఘటనలలో వీడియోలు ఎందుకు బయటకు రాలేదని ప్రశ్నించారు. ఒక సామాజిక తరగతి అధికారులను అడ్డం పెట్టుకొని టిడిపి నేతలు రిగ్గింగ్ చేశారని ,టిడిపి ఎంపి అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు ఏమి తెలియనట్లు మాట్లాడుతున్నారని అన్నారు. దాడులు జరుగుతున్న గ్రామాల్లోకి పోలీసులు రాకుండా పక్క గ్రామాల్ల తిరిగారన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఘన విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. టిడిపి రిగ్గింగ్ కు పాల్పడుతున్న ఒప్పిచర్ల, తుమ్మకోట,పాల్వాయి గేట్,చింతపల్లి గ్రామాల్లో రీ పోలింగ్ పెట్టాలని అడిగినా ఈసి స్పందించలేదని అన్నారు. ముటుకూరులో ఎస్సి,బిసిలను భయ భ్రాంతులకు గురిచేశారన్నారు. అధికారులు పోలీసులు ఎన్ని విధాలుగా టిడిపికి అనుకూలంగా పని చేసినా ప్రజలు వైసిపి వైపే ఉన్నారని, రానున్న ఎన్నికలలో వైసిపి అధికారంలోకి రావడం జగన్మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు.

పోలీసులు ఎవరి ఆధీనంలో పనిచేస్తున్నారో ఈసీ చెప్పాలి?

- కొత్తపుల్లారెడ్డిగూడెం, కండ్లకుంట పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించండి
- జీవీ ఆంజనేయులు డిమాండ్

ప్రజాశక్తి - వినుకొండ

రాష్ట్రంలో పోలీసు యంత్రాంగం ఎవరి ఆధీనంలో పనిచేస్తుందో ఇప్పటికైనా ఎన్నికల సంఘం చెప్పాలని వినుకొండ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేరుగా పోలింగ్ కేంద్రంలోకి చొరబడి ఒక ఎమ్మెల్యే అందరూ చూస్తూ ఉండగానే ఈవీఎం పగలగొడితే గుర్తుతెలియని వ్యక్తి అని కేసు నమోదు చేసిన దగ్గర నుంచి ఆయన పరారీ పరిణామాలన్నీ చూసిన ప్రజలందరిలో ఇవే సందేహాలు ఉత్పన్నమవు తున్నాయని అన్నారు. స్వేచ్ఛాయుత, పారదర్శక వాతా వరణంలో ఎన్నికల జరిగాయని ఇలాంటి పరిస్థితుల మధ్య ఈసీ ఎలా నమ్మకం కలిగించగలదని ప్రశ్నించారు. పాల్వాయిగేటులో ఈవీఎం విధ్వంసం, అనంతర పరిణామాలపై ఈసీ, పోలీసుల పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈవీఎం పగలకొట్టిన వారిని పట్టుకోలేకపోవడం ఇంత పెద్దరాష్ట్రం పోలీసు యంత్రాం గానికి, కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో వారిపై అజ మాయిషి కలిగి ఉన్న ఎన్నికల సంఘానికి సిగ్గుచేటు కాదా అని నిలదీశారు. మే 13నే ఈవీఎం ధ్వంసమైందని గుర్తించి, తర్వాతి రోజే కేసులు పెట్టినప్పుడు హౌస్ అరెస్టు నుంచి తప్పించుకున్న వెంటనే పిన్నెల్లి సోదరులను ఎందుకు వెదికి పట్టుకోలేకపోయారో ఈసీ, పోలీసులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత అరెస్టు ప్రయత్నాలకు ముందు రోజే పిన్నెల్లి మీడియాకు ఇంటర్వ్యూలు ఇచ్చినా పోలీసులకే అతడి జాడ తెలియకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని అన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆయన సోదరుడును వెంటనే అరెస్ట్ చేయాలని, టిడిపి ఏజెంట్లను కొట్టి రిగ్గింగ్ చేసిన కొత్తపుల్లారెడ్డిగూడెం, కండ్లకుంట తదితర పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అరవిందబాబు కారు దహనం చేసిన దుండగులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో యం త్రాంగం విఫలమైందని ఆక్షేపించారు. అందుకే కంటి తుడుపు చర్యలు కాకుండా పల్నాడు జిల్లా నూతన ఎస్పీ ఇటువంటి అరాచక శక్తులను కఠినంగా అణిచివేయాలని ఆయన కోరారు.

సుభాని చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-ముప్పాళ్ల



బొల్లవరం అడ్డరోడ్డు వద్ద హోంగార్డు సుభాని ఏర్పాటు చేసిన చలివేంద్రంలో గురువారం దమ్మాలపాడుకి చెందిన దాత దాసరి నాగబాబు ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.సింగారావు పాల్గొన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దాం మాట్లాడుతూ సుభాని చలివేంద్రం ఏర్పాటు చేసి తన సేవా గుణాన్ని చాటుకున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో దమ్మాలపాడు పంచాయతీ కార్యదర్శి నాగమల్లేశ్వరరావు,విఆర్వో హరిబాబు, మీరావలి పాల్గొన్నారు.

బుద్ధుని మార్గం అనుసరణీయం


వర్సిటీలో


గుంటూరులో

ప్రజాశక్తి - ఎఎన్‌యు

నేటి సమాజానికి దిక్సూచిగా బౌద్ధం నిలుస్తుందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వీసీ పి.రాజశేఖర్ అన్నారు. వర్సిటీలోని బౌద్ధ అధ్యయన విభాగం ఆధ్వర్యంలో గురువారం బుద్ధ పూర్ణిమ వేడుకలు జరిగాయి. వీసీ మాట్లాడుతూ బుద్ధ పూర్ణిమ, బౌద్ధ ధర్మం విశిష్టత ఎంతో గొప్పదని, బుద్ధుని ధమ్మ విషయాలు ఆచరణ యోగ్యమైనవని, అవి సమాజానికి ఎంతో మార్గదర్శనంగా నిలుస్తాయి అన్నారు. బౌద్ధ సిద్ధాంతాలు నేటి యువత అలవర్చుకొని రాణించాలని, జీవిత లక్ష్యాలను సాధించే క్రమంలో శాంతి, సహనం, కృషి, పట్టుదల వంటివి అలవర్చుకోవాలని సూచించారు. బౌద్ధ అధ్యయన విభాగ అధిపతి ప్రొఫెసర్ ఎల్.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ బౌద్ధ జయంతి ప్రాముఖ్యత అధ్యయనం గురించి వివరించారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధరరావు, సిడిసి డిన్ కె.మధుబాబు, విదేశీ విద్యార్థుల విభాగం డైరెక్టర్ జి.చెన్నారెడ్డి, దూరవిద్య పరీక్షల విభాగ సమన్వయకర్త డాక్టర్ కె.సోమశేఖర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

దేశం ఎదుర్కొంటున్న అనేక సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సమస్యల పరిష్కారానికి బుద్ధుని మార్గం అనుసరణీయమని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అన్నారు. గుంటూరులోని విజేత కాన్సెప్ట్ స్కూల్‌లో బుద్ధ జయంతి వేడుకలు జరిగాయి. సభకు సెంటర్ ఫర్ సోషల్ సైకాలజీ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎన్.అరవింద్ అధ్యక్షత వహించారు. లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ బౌద్ధ మతం నేడు ప్రపంచంలో నాలుగో పెద్ద మతంగా ఉందని, ప్రపంచ జనాభాలో ఏడు శాతం మంది బౌద్ధ ధర్మాన్ని ఆచరిస్తున్నారని తెలిపారు. బుద్ధుని బోధనలో పంచశీల ముఖ్యమైందని, ప్రాణ హాని చేయరాదని, దొంగతనం ఉండరాదని, అబద్ధ మాడరాదని, వ్యభిచారంను నివారించాలని, మత్తు పానీయాలను నిరోధించాలని 2,600 ఏళ్ల క్రితమే బుద్ధుడు చెప్పాడని వివరించారు. దుఖా:నికి కారణం కోరికలని, వాటిని అధిగమించడానికి అష్టాంగ మార్గాన్ని ఆచరించాలని గౌతమ బుద్ధుడు ప్రబోధించాడని అన్నారు. నేడు ప్రపంచంలో దాదాపు 30 దేశాలలో బౌద్ధం అమలులో వుందన్నారు. ప్రొఫెసర్ ఎన్. అరవింద్ మాట్లాడుతూ పుట్టుకతో సంబంధం లేకుండా ప్రతి మనిషి బుద్ధుడులా జీవించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ప్రత్యూష సుబ్బారావు, పి.రమేష్, డి.దేవరాజ్, ఒ.నారాయణరెడ్డి, మధు, లక్ష్మణరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

మానసిక వికాసానికి, వర్తమాన సమాజంలోని సమస్యల పరిష్కారానికి బౌద్ధం దారి చూపుతుందని సెంటర్ ఫర్ సోషల్ సైకాలజీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ నూతలపాటి అరవింద్ అన్నారు. మానవతా వేదిక ఆధ్వర్యంలో మంగళగిరి గౌతమ బుద్ధ రోడ్‌లోని వైష్ణవి కళ్యాణ మండపంలో గురువారం రాత్రి గౌతమ బుద్ధుని

పలుచోట్ల ఘనంగా బుద్ధ జయంతి

2568వ జయంతికి వేదిక కన్వీనర్ గోలి మధు అధ్యక్షత వహించారు. మంగళగిరి కొత్త విహార అధ్యక్షులు రేఖా కృష్ణార్జునరావు మాట్లాడుతూ కరుణ, మైత్రి పునాదుల మీద విశ్వ శ్రేయస్సుకు దోహదపడే బౌద్ధం అని అన్నారు. సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ నైతికత పునాదుల మీద నడిచేది బౌద్ధమని, నేటి సైకాలజిస్టులలో ఏ ఒక్కరూ బుద్ధుడు మార్గాన్ని కాకుండా ముందుకు వెళ్లలేరని అన్నారు. మంగళగిరి సాహితీ కళావేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు మాట్లాడుతూ మానవజాతి మనుగడ, సమాజంలోని రుగ్మతల నిర్మూలనకు బుద్ధుని బోధనలు ఉపయుక్తమన్నారు. ఈ సందర్భంగా అఖిలభారత శరీర అవయవదాతల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గూడూరు సీతామహాలక్ష్మిని సన్మానించారు. పి.రవి, కె.కాశయ్య, కళాధర్‌రెడ్డి, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు. రచయిత, గాయకులు అల్లక తాతారావు నిర్వహణలో శ్రీ ఉమామహేశ్వర కళాక్షేత్రానికి చెందిన నాట్యాచార్య కందికట్ల వాసుదేవరావు, తీడా బాలకృష్ణ శిష్య బృందం నృత్య ప్రదర్శన, కవి, రచయిత గాయకుడు సందుపట్ల భూపతి ధర్మవిజేత, సామ్రాట్ అశోక్ ఏకపాత్రాభినయం ఆకట్టుకున్నాయి.


మంగళగిరిలో

స్థానిక ఎస్సీ/ఎస్టీ రైట్ అండ్ యాక్ట్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆర్మీ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల పరిషత్ ఆవరణలోని గౌతమ బుద్ధిని విగ్రహం వద్ద బుద్ధ జయంతి నిర్వహించారు. బుద్ధుని ఆశయాలను, మార్గాలను అనుసరించాలని ప్రతిజ్ఞ చేశారు. ట్రస్ట్ చైర్మన్ కె.రామారావు, సభ్యులు బి.గోవిందరాజు, జి.వెంకయ్య, రామకృష్ణారావు, శివదాసు పాల్గొన్నారు.



అధ్వానంగా పిడబ్ల్యూడి రోడ్డు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

నిత్యం వందల కొద్ది వాహనాలు రద్దీగా తిరుగుతుంటాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే ఎమ్‌టిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం నుండి రేవేంద్రపాడు వెళ్లే పిడబ్ల్యూడి రోడ్డు అద్వానంగా తయారైంది. నాలుగైదేళ్లుగా ఆర్ అండ్ బి అధికారులు రోడ్డు మరమ్మతులు చేయడం మానేశారు. కెఎల్ యూనివర్సిటీ దాటిన తర్వాత మెల్లంపూడి దగ్గరలో తారు రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. పిడబ్ల్యూడి రోడ్డుపై రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలు కూడా లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కెఎల్ యూనివర్సిటీ కి వచ్చే విద్యార్థిని, విద్యార్థులు గ్రామాల నుండి వచ్చే రైతులు, కార్మికులు ఆ గుంతల వద్ద ప్రమాదాల బారిన పడుతున్నా అధికారులు మాత్రం రోడ్డును పునరుద్ధరించడం కానీ, ఏర్పడిన గుంతలను పూడ్చడం కానీ చేయడం లేదు. పూర్తిగా రోడ్డు తెగిపోయి, ప్రమాద భరితంగా మారిన రోడ్డును అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. ఇటీవల వర్షాలు కురవడంతో మరి అధ్వానంగా తయారైంది. ఇటీవల రోడ్డు వెడల్పు చేసే క్రమంలో గ్రావెల్ తోలి, ఎర్ర మట్టిని సరి చేయకపోవడంతో వర్షాలు కురిసినప్పుడు బురద మయంగా మారి ప్రమాదాల కూడా జరుగుతున్నాయి. తక్షణమే సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు రోడ్డును త్వరగా పూర్తిచేసి, ప్రమాదాలు నివారించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



'అనుమతులు లేకుండా నిర్మాణాలతో సొమ్ము చేసుకుంటూ మోసం'

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక లక్ష్మీనరసింహస్వామి కాలనీ గుంటూరు ఛానల్ సమీపంలో ప్రైమ్ గ్రైండర్ అనే కార్పొరేట్ సంస్థ సహాయంతో ప్రజలను మోసం చేసి దారి లేకుండా ఉన్నట్టు మ్యాప్‌లో చూపి అక్రమ నిర్మిణాలు చేసి సంస్థలో పెట్టుబడి పెట్టిస్తున్న పి.శ్రీనివాసరావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కుంచాల కృష్ణ కిషోర్ కోరారు. గురువారం సాయంత్రం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అక్రమ నిర్మాణాలైన ఆ విల్లాలకు అనుమతి లేదని సిఆర్‌డిఎ రద్దు చేసి నాలుగేళ్లయ్యిందని చెప్పారు. ఒక డాక్యుమెంట్ ఫేక్ అని తేలగా మున్సిపాలిటీ కార్యాలయంలో అతనికి నోటీసులు ఇచ్చారని తెలిపారు. ఈ విషయాలనే కప్పిపుచ్చి ప్రజలను మోసం చేస్తూ సొమ్ము చేసుకోవటమే పనిగా పెట్టుకున్నారని, ప్రేమ్ గ్రైండర్ విల్లాస్‌లో ప్లాట్లు కొన్నవారు అప్రమత్త అవ్వాలని కోరారు. సమావేశంలో ఎం.ఆంజనేయులు, ఎన్.నాగరాజు, కె.రాజేష్, సుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ భావన్నారాయణ స్వామి రథోత్సవం

ప్రజాశక్తి - పొన్నూరు

పట్టణంలోని శ్రీ సుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత శ్రీ సాక్షి భావన్నారాయణ స్వామి రథోత్సవం గురువారం ఘనంగా జరిగింది. సందర్శకులు భారీగా తరలివచ్చారు. ఉదయం 5 గంటలకు గరుడోత్సవం నిర్వహించారు. ఉభయ దాతలుగా కొండముది రామకృష్ణారావు సోదరులు వ్యవహరించారు. దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ, ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీమంతు రాజా వాసిరెడ్డి సుధా స్వరూపు బహదూర్ మన్నే సుల్తాన్ దొర సౌజన్యంతో, ఉప ప్రధాన అర్చక పరాశరం రఘునాథ్‌బాబు పర్యవేక్షణలో దేవస్థానం సహాయక కమిషనర్, కార్యనిర్వహణ అధికారి మండేపూడి పానకాలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య దంపతులు రథోత్సవాన్ని ప్రారంభించారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు మజ్జిగ పంపిణీ చేశాయి.



ఉపాధ్యాయులు సామాజిక నిబద్ధతతో పని చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఉపాధ్యాయులు సామాజిక నిబద్ధతతో పనిచేసి, ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా బి.ఇడి చేసిన ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం గురువారం స్థానిక లాడ్జి సెంటర్‌లోని ఏ.ఎల్.బిఇడి కాలేజీలో నిర్వహించారు. కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యారంగంలో కార్పొరేట్, ప్రైవేటు రంగాలు ప్రవేశించిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో పేదలు, నిరుపేదలు మాత్రమే చదువుతున్నారన్నారు. కావున వారి అభివృద్ధి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతమైనా, పట్టణప్రాంతమైనా ఎక్కడ పనిచేస్తున్నా అక్కడి విద్యార్థులు, పరిసర ప్రాంతాల ప్రజలతో మమేకమై పనిచేసి, మంచి ఉపాధ్యాయులుగా పేరుతెచ్చుకోవాలని సూచించారు. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్తేర్ సునీల మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు వ్యక్తిగతమైన బాధ్యతతో వారికి అప్పగించిన బాధ్యతలను వందశాతం నెరవేర్చుటానికి కృషి చేయాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులను చదువుతోపాటు, ఆటలు, సాంస్కృతిక నైపుణాలు ఇలా అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నారు. ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులుగా ఉంటూ సమాజంలో వచ్చే మార్పులను ఎప్పుటికప్పుడు విద్యార్థులకు అందించాలన్నారు. అనంతరం లక్ష్మణరావును, ప్రిన్సిపాల్‌ను ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

పాత గొడవను మనసులో పెట్టుకుని దాడి

ప్రజాశక్తి - తెనాలి

యువకుడిని అటకాయించి కత్తితో దాడి చేసిన ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు గురువారం వెల్లడించిన వివరాల ప్రకారం.. మండలంలోని కొలకలూరుకు చెందిన ఉన్నం అరుణ్ కుమార్ హైకోర్టులో న్యాయవాది వద్ద గుమస్తాగా పనిచేస్తున్నారు. గురువారం బైక్‌పై ఇంటికి వెళుతూ కాజీపేటలో బైక్‌లో పెట్రోల్ కొట్టించుకునే నిమిత్తం బంకు వద్ద ఆగాడు. అదే సమయంలో గ్రామానికి చెందిన సిహెచ్ సురేష్, సిహెచ్ సందీప్ బైక్‌పై ఆగి ఉన్న అరుణ్ కుమార్‌పై వాగ్వివాదానికి దిగి కత్తితో దాడికి పాల్పడ్డారు. గాయపడిన అరుణ్ కుమార్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. దాదాపు రెండు నెలల క్రితం అరుణ్ కుమార్ బైక్ యాక్సిడెంట్‌కు సంబంధించి స్థానిక యువకులతో ఘర్షణ జరగ్గా, దానికి సంబంధించి పెద్దల సమక్షంలో రాజీ కుదిరింది. అయినా ఆ గొడవను మనసులో పెట్టుకుని అరుణ్ కుమార్ పై దాడికి పాల్పడినట్లు బాధితుడు ఆరోపించాడు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



శిక్షణ పొందిన మహిళకు కుట్టు మిషన్ అందిస్తున్న బాపయ్యచౌదరి, కెఎస్ లక్ష్మణరావు తదితరులు

శిక్షణను జీవిత ఉన్నతికి ఉపయోగించుకోవాలి

- నాట్స్ అధ్యక్షులు బాపయ్య చౌదరి, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు
- శిక్షణ పొందిన మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేత

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

మండల కేంద్రమైన పెదనందిపాడులోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో 10 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరి, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణ రావు, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు గురువారం అందజేశారు. నాట్స్ సహకారంతో మూడు నెలలుగా తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో కొమ్మూరు, వరగాని, జి.జి.పాలెం, నాగులపాడు గ్రామాలకు చెందిన మహిళలకు కుట్టు శిక్షణిచ్చారు. గురువారంతో మొదటి బ్యాచ్ శిక్షణ ముగిసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కమిటీ కన్వీనర్ డి.రమేష్‌బాబు అధ్యక్షత వహించారు. కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ శిక్షణ పొందిన మహిళలు దాన్ని సద్వినియోగ పరుచుకొని జీవితాన్ని మెరుగు పర్చుకోవాల న్నారు. అమెరికా వెళ్లినా సొంతూరును మర్చిపో కుండా గ్రామాఅభివృద్ధి కోసం బాపయ్య చౌదరి కృషి చేస్తున్నారని అన్నారు. గ్రూప్-4 స్టడీ మెటీరియల్ పంపిణీకీ ఆయన సహకరించారని చెప్పారు. బాపయ్య చౌదరి మాట్లాడుతూ తాను పుట్టిన గ్రామాభివృద్ధికి సేవచేసే అవకాశం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. నాట్స్ ద్వారా ఆంధ్ర, తెలంగాణలోని వివిధ గ్రామాల్లో వైద్య శిబిరాలు, కుట్టు శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 26న పెదనందిపాడులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. పారిశ్రామికి వేత్తలు దాసరి శేషగిరిరావు మాట్లాడుతూ శిక్షణ పొందడంతోనే సరిపెట్టకుండా దానిని తమ కుటుంబాలకు ఆసరాగా చేసుకోవాలని సూచించారు. ఎ.కృష్ణ మాట్లాడుతూ కుట్టు శిక్షణ పొందిన వారికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని, నైపుణ్యంలోనూ శిక్షణ పొందితే మార్కెంట్‌లో మరింత డిమాండ్ ఉంటుందని చెప్పారు. పాశం రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో 30 విజ్ఞాన కేంద్రాలు నడుపుతున్నామని, వీటి ద్వారా కంప్యూటర్ శిక్షణ, పిల్లలకు వేసవి శిక్షణ శిబిరాలు, బాలోత్సవాలు, ట్యూషన్ పాయింట్లు, మహిళ లకు నైపుణ్య శిక్షణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ముద్దన రాఘవ య్య మాట్లాడుతూ విజ్ఞాన కేంద్రం నిర్వహించే కార్యక్రమాలకు తన వంతు సహాయం అందిస్తా నని చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువపత్రాలు అందించారు. మొదటి బ్యాచ్లో 21 మంది శిక్షణ పొందినట్లు డి.రమేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో ఎన్.బాలకృష్ణ, కె.శ్రీనివాస్, ఎన్.ఆచారి, బి.ప్రసాద్, సిహెచ్.యానాదులు, కె.వెంకట సుబ్బారావు, జె.రామారావు, ఎం.వెంకటేశ్వర్లు, బి.శంకరయ్య, టి.ప్రతాపరెడ్డి, కె.చంద్రరావు, భువనేశ్వరి, ఎం.లక్ష్మి, జి.మోహనరావు, రవి, శిక్షకులు ఎన్.భారతి పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు కోసం 973 మంది

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు నియమించిన కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ కోసం గురువారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగర కమిషనర్ కీర్తి చేకూరితో కలసి ఎన్ఐసి పోర్టల్ ద్వారా మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించి ఉత్తర్వులను జనరేట్ చేశారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఈవియం, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ఏర్పాటు చేసిన 245 టేబుల్స్‌కు అవసరమైన కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు రిజర్వుతో కలిపి మొత్తం 973 మంది ఉద్యోగులకు శిక్షణ ఉత్తర్వులను జనరేట్ చేశారు. ఈవీయం ఓట్లు లెక్కించే కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు మే 27వ తేదీ రెండు షిఫ్ట్‌లలోనూ, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు చేసే కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు మే 28వ తేది ఉదయం ఒక షిఫ్ట్‌లో కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాల్‌లో కౌంటింగ్‌పై మొదటి విడత శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, తాడికొండ నియోజకవర్గ ఆర్‌ఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, పొన్నూరు నియోజకవర్గ ఆర్‌ఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిఎంసి అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి , ఎన్నికల మ్యాన్ పవర్ నోడల్ అధికారి శైలజ, ఐటీ నోడల్ అధికారి రఘు, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ ఏఈఆర్వో బీమారావు, ఎన్ఐసీ డిఐఓ బిమల్ కుమార్, మురళీకృష్ణ పాల్గొన్నారు.



ర్యాండమైజేషన్ ద్వారా ఉత్తర్వులు జనరేట్ చేస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు తెలిపారు. గురువారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీసీ సమావేశ మందిరం నుంచి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగర కమిషనర్ కీర్తి చేకూరితో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏఎన్‌యులోని నాలుగు బ్లాకలలో జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపునకు కౌంటింగ్ హాల్స్‌లో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయటం జరిగిందన్నారు. కౌంటింగ్ హాల్స్‌లో ఇంటర్నెట్ సౌకర్యం కోసం లీజ్డ్‌లైన్లు ఏర్పాట్లు రెండ్రోజుల్లో పూర్తి అవుతుందన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం కౌంటింగ్‌హాల్స్, స్ట్రాంగ్ రూమ్స్ వద్ద పూర్తిస్థాయిలో భద్రత ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. మీడియా సెంటరులో ఏర్పాట్లు పూర్తి చేయటం జరిగిందన్నారు. ఓట్లు లెక్కింపునకు సంబంధించి గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గానికి 30 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నందున సాయంత్రం 4 గంటల నుంచి ఆరు గంటల్లోపు లెక్కింపు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. వీవీప్యాట్‌ల ఓట్ల లెక్కింపు సాయంత్రం ఆరుగంటలకు పూర్తి అయ్యేలా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి మంగళగిరి నియోజకవర్గంలో 40 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, ఓట్ల లెక్కింపు 22 రౌండ్లు ఉన్నందున రాత్రి 8 గంటలకు కౌంటింగ్ పూర్తయ్యే అవకాశం ఉందని, మిగతా నియోజకవర్గాలు సాయంత్రం 4 గంటలకే కౌంటింగ్ పూర్తవుతుందని వివరించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపునకు సంబంధించి పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా టేబుళ్లు ఏర్పాటు చేశామని, ఓట్లు లెక్కింపునకు సంబంధించి మొదటి ర్యాండమైజేషన్ ద్వారా ఉద్యోగులను శిక్షణకు కేటాయించామని, వీరికి 27, 28 తేదీల్లో మొదటి శిక్షణ ఇస్తామని చెప్పారు. జూన్ 2వ తేది రెండవ ర్యాండమైజేషన్ చేసి కౌంటింగ్ సిబ్బందికి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా రెండవ విడత శిక్షణ ఇస్తామని ముఖేష్‌కుమార్ మీనాకు కలెక్టర్ వివరించారు.

డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టులకు రేపు పరీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

విద్యాశాఖలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ పోస్టులకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ ఆధ్వర్యంలో ఈనెల 25న పరీక్ష నిర్వహిస్తున్నారు. ఉదయం 9 గంటల నుండి 11.30 గంటల వరకూ 12 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు 1975 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 8.15 గంటల లోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. మరొక 15 నిముషాలు గ్రేస్ పీరియడ్ ఉంటుంది. 8.30 గంటల వరకూ మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. అభ్యర్థులు హాల్‌టిక్కెట్‌తోపాటు, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డును చూపించాల్సి ఉంటుంది. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాలకు తీసుకురాకూడదని అధికారులు తెలియజేశారు.

మహిళలు స్వతంత్రంగా ఎదగాలి

ప్రజాశక్తి - తెనాలి

ఎన్‌సిసి క్యాడెట్లకు శిక్షణలో మేజర్ పారుల్ శర్మ

మహిళలు స్వతంత్ర శక్తిగా ఎదగాలని, మనోధైర్యం ఆర్థిక స్థిరత్వం కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్.సి.సి డైరెక్టరేట్, ఏ.డి ట్రైనింగ్ ఆఫీసర్ మేజర్ పారుల్ శర్మ అన్నారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల నంబూరులో నిర్వహిస్తున్న 10 ఆంధ్రా బెటాలియన్ బాలికల వార్షిక శిక్షణ శిబిరాన్ని ఆమె గురువారం సందర్శించారు. పది రోజులు పాటు నిర్వహించనున్న ఈ శిబిరంలో రెండోరోజు కార్యక్రమంలో భాగంగా ఎన్.సి.సి బాలికల క్యాడెట్స్ కు ఆయుధాలను ఉపయోగించే తీరు, డ్రిల్, టెంట్ పిచింగ్ వంటి అంశాలలో శిక్షణిచ్చారు. క్యాడెన్స్‌ను ఉద్దేశించి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మేజర్ పారుల్ శర్మ మాట్లాడుతూ బాలికలు డిఫెన్స్ రంగాలపై ఆసక్తి చూపాలని, స్వతంత్రంగా ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.వి.ఎస్ సుదర్శన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మేజర్ అవినాష్ పట్వాల్, వివిఐటి ఎన్.ఎస్.ఎస్ అఫీసర్ డాక్టర్ ఆళ్ల శ్రీవాణి, గుంటూరు బెటాలియన్ ఎన్ఎస్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రైవేటు ఆసుపత్రులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో ఉన్న అన్ని ప్రైవేటు ఆసుపత్రులు, దంతవైద్యశాలలు, లేబొరేటరీలు, స్కానింగ్ సెంటర్లు, సరోగసీ సెంటర్లు, సంతాన సాఫల్య కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవటం, నిర్ణీత సమయంలో రెన్యువల్ చేయించుకోవటం తప్పనిసరి అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయించుకోని పక్షంలో అల్లోపతి, గర్భస్థ లింగనిర్ధారణ నిరోధక, సరోగసీ, ఏఆర్‌టి యాక్ట్‌ల ప్రకారం చర్యలు తీసుకోవటంతోపాటు, చట్ట ఉల్లంఘన తీవ్రతను బట్టి ఆయా సెంటర్స్‌ను సీజ్ చేస్తామని పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు పెయిడ్ హాలిడేస్ ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు పెయిడ్ హాలిడేస్ వెంటనే ఇవ్వాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నాగరాజు డిమాండ్ చేశారు.గురువారం పాతగుంటూరులో నిర్వహించిన సమావేశంలో నాగరాజు మాట్లాడుతూ మే 31 నాటికి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు పెయిడ్ హాలిడేస్ బకాయి వేతనాలను చెల్లించని పక్షంలో అన్ని ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ కార్యాలయాల వద్ద జూన్ 1 తరువాత ఆందోళన చేపడతామని దానికి విద్యుత్ యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు సెలవు దినాల్లో కూడా పనిచేసినందుకు వేతనాలు ఇవ్వాల్సి ఉండగా గత ఐదేళ్ల నుండి ఇవ్వకపోగా 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తక్షణమే చెల్లించమని కార్పొరేట్ ఆఫీస్ నుంచి ఆదేశాలున్నా చెల్లించకపోవడం కాంట్రాక్ట్ కార్మికుల పట్ల చిన్నచూపు అన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు కలుగజేసుకొని కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం, పెయిడ్ హాలిడేస్ వెంటనే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు బి.లక్ష్మణరావు, కోశాధికారి జయరాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగరాజు